
ఈనాడు
అమరావతి
కృష్ణా
శుక్రవారం అక్టోబరు 18, 2024

వంతుకొస్తారా.. అంతుచూడాలా?

ఎన్టీఆర్ జిల్లా మద్యం దుకాణాలు 113 దరఖాస్తులు 5,825
కృష్ణా జిల్లా 123 2,942





కృష్ణాలో లెక్కే వేరప్పా..!

ఈనాడు, అమరావతి

'దుకాణం ఇస్తే మాకు ఇవ్వు లేదా 50 శాతం వాటా ఇవ్వు.. నువ్వు ఎన్ని డీడీలు (దరఖాస్తులు) కట్టావనేది మాకు అనవసరం లేదా నిర్వహణ మొత్తం మాకే ఇవ్వు.. లెక్కలు మేం తేలుస్తాం..!'

కృష్ణా జిల్లాలో ఒక నియోజకవర్గంలో దుకాణాలు దక్కించుకున్న మద్యం వ్యాపారులకు ఓ ప్రజాప్రతినిధి పేరుతో అందిన హెచ్చరిక ఇది..!

'మా పరిధిలో మద్యం దుకాణం పెట్టాలంటే ఫార్మాలిటీస్ (మామూళ్లు) పూర్తి చేయాలి. లేకపోతే వ్యాపారం కూడా సాగదు..!' మరో నియోజకవర్గంలో ప్రజాప్రతినిధే స్వయంగా చేసిన హెచ్చరికలు ఇవి. దీంతో ఆ నియోజకవర్గంలో దుకాణాలు పెట్టేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. పక్క చూపులు చూస్తున్నారు. అక్కడ వసూల్ రాజాగా ముద్ర పడిన ప్రజాప్రతినిధితో తలనొప్పి ఎందుకని ఇతర ప్రాంతాల్లో పెట్టేందుకు దుకాణాల కోసం గాలిస్తున్నారు.

- దుకాణం ఇవ్వు లేదా 50 శాతం వాటా
- మద్యం వ్యాపారులకు నేతల హెచ్చరికలు
- పలు ప్రాంతాల్లో తెరుచుకోని దుకాణాలు...

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మద్యం దుకాణాల దందా ప్రారంభమైంది. దుకాణాల ఏర్పాటు నుంచే బెదిరింపులు మొదలయ్యాయి. మద్యం, ఇసుక వ్యాపారంలో జోక్యం చేసుకోవద్దని.. సీఎం చంద్రబాబు తమ్ముళ్లను హెచ్చరించినా పెడచెవిన పెట్టారు. తమ దోవ తమదే అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో బరితెగించారు. ముందుగానే దరఖాస్తులు చేయవద్దని హెచ్చరించిన నేతలు.. తమ వ్యాపారులను సిండికేట్ చేయించి దరఖాస్తులు చేయించారు. వారికి 'అదృష్టం' కలిసి రాక లాటరీలో దుకాణాలు రాకపోవడంతో వచ్చిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. 50 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకపోతే.. 'అమ్మకాలు ఎలా సాగుతాయో చూస్తామని' హెచ్చరికలు పంపుతున్నారు. దుకాణంలో వాటాతో పాటు.. గొలుసు దుకాణాలు మావాళ్లకే ఇవ్వాలని షరతులు పెడుతున్నారు. ఈ నెల 14న మద్యం దుకాణాలకు లాటరీల ద్వారా వ్యాపారులను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో విపరీతమైన పోటీ ఏర్పడింది. కృష్ణా జిల్లా కంటే ఎన్టీఆర్ జిల్లాకు అధిక దరఖాస్తులు అందాయి. అందిన దరఖాస్తులే పోటీ తీవ్రతను వెల్లడించాయి. కృష్ణా జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సిండికేట్ ప్రయత్నాలు చాలా వరకు ఫలించడంతో తక్కువ దరఖాస్తులు అందాయి. ఇప్పుడు అదృష్టవంతులను నేతలు వెంటాడుతున్నారు.

కృష్ణా జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 50 శాతం వాటాలకు పట్టుబడుతున్నారు. లేదంటే దుకాణం వదిలేయాలని హెచ్చరిస్తున్నారు. ★ **పామర్రు పట్టణంలో** 4 దుకాణాలకు ఒకటే ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రజాప్రతినిధి అనుచరులు దాదాపు 20 దరఖాస్తులు చేశారు. ఒక్కటీ రాలేదు. దీంతో తమకు ఖర్చు అయిందని వాటాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ★ **పామర్రు నియోజకవర్గంలో** 16 దుకాణాల్లో ఇంకా పలుచోట్ల ఏర్పాటు చేయలేదు. వాటాలు తేలితేనే అని పట్టుబడుతున్నారు. గొలుసు దుకాణాలు సైతం తమ వారే నిర్వహిస్తారని చెబుతున్నారు. ★ **గన్నవరం నియోజకవర్గంలో** నేరుగా హెచ్చరికలు చేస్తున్నారు. మొత్తం 23 దుకాణాల్లో 13 దుకాణాలు ప్రజాప్రతినిధి సిండికేట్‌కు దక్కాయి. ముందుగానే దరఖాస్తులు చేయవద్దని హెచ్చరించిన విషయం తెలిసిందే. మిగిలిన వాటిలో 50 శాతం కావాలని పట్టుబడుతున్నారు. నగరాన్ని ఆనుకుని ఉన్న రామవరప్పాడు, ప్రసాదంపాడులో ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు.

★ **గుడివాడ నియోజకవర్గంలో** కొన్ని వైకాపా వ్యాపారుల సిండికేట్‌కు వచ్చాయి. దీంతో అక్కడ 'రాజీ' సూత్రం పాటిస్తున్నట్లు తెలిసింది. గుడివాడ పట్టణంలో 7, గ్రామీణంలో 2 దుకాణాలకు.. వైకాపా సానుభూతిపరులకు 2, విజయవాడకు చెందిన తెదేపా నాయకుడి సిండికేట్‌కు 3, స్థానిక నేతల సిండికేట్‌కు 2 దుకాణాలు వచ్చాయి. వీరి మధ్య చర్చలు జరుగుతున్నాయి. ★ **గుడ్లవల్లేరులోనూ** బందరుకు చెందిన వ్యాపారితో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ఇక్కడ సిండికేట్‌లు తమకు 50 శాతం కావాలని పట్టుబడుతున్నారు. ★ **పెనమలూరు నియోజకవర్గంలో** తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పంట పండుతోంది. ఇక్కడ నాలుగు దుకాణాలు వచ్చాయి. కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకిల్లో ఎక్కడైనా ఏర్పాటు చేయవచ్చు. జనాభా ఎక్కువ, పక్కనే విజయవాడ నగరం, ఆటోనగర్ ఉండటంతో వ్యాపారం జోరుగా సాగుతుందని అంచనా. ఇక్కడ ప్రజాప్రతినిధి సిండికేట్ చేసి దరఖాస్తులు చేయించారని ప్రచారం ఉంది. విజయవాడ నగరంలో దుకాణాలు ఎక్కువగా తూర్పు పరిధిలో ఏర్పాటు వెనుక ఈ కారణం కూడా ఉంది.

దుకాణాల కొనుగోలు...

తెలంగాణ సరిహద్దులో వ్యాపారం జోరుగా ఉంటుందని ఆశించి దరఖాస్తులు చేసిన వ్యాపారులకు చుక్కెదురైంది. తక్కువ ధరలకు మద్యం లభిస్తుందని తెలంగాణకు తరలించవచ్చని ఆశించారు. ఇది నెరవేరకపోవడంతో దుకాణాలను స్థానిక సిండికేట్‌కు విక్రయించారు. రూ.90 లక్షల నుంచి రూ.కోటి వరకు విక్రయించి చేతులు దులుపుకొన్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో అయిదు దుకాణాలు విక్రయించారు. నిబంధనల ప్రకారం దుకాణాల అద్దెకు తీసుకునేందుకు కొంత సమయం పడుతుందని ఎక్సైజ్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదు?

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: గిలకలదిండి ఫిషింగ్‌హార్బర్ నిర్మాణం మొదలై రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు పూర్తి కాలేదని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను నిలదీశారు. ఫిషింగ్‌హార్బర్, మత్స్యశాఖ అధికారులతో గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు 60శాతం పనులు మాత్రమే పూర్తికావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏపీ మారిటైం బోర్డు ఈఈ కె.వి.కె. పల్లార్వు మాట్లాడుతూ మరో 18 నెలలు హార్బర్ నిర్మాణ గడువు పొడిగించాలని ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. బ్రేక్‌వాటర్ చివరలో సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యం అవుతుందన్నారు. జాలీ డెప్పై వారికి కొన్ని ఆక్షలు తయారు చేసి అందించే పనిలో గుత్తేదారు ఉన్నారని తెలిపారు. మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం కింద జిల్లాలో రెండు గ్రామాలను క్లైమెట్ రెసిలెన్స్ ఫిషర్‌మ్యాన్ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. నాగాయలంక మండలం సొర్లగొంది, గిలకలదిండి గ్రామాల అభివృద్ధికి ఒక్కొక్క గ్రామానికి రూ.2కోట్లు కేంద్రం నిధులు అందిస్తుందని వివరించారు. మత్స్యకారులకు ప్రస్తుతం ఇస్తున్న 40 శాతం రాయితీని 75 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి రవీంద్ర జేడీకి సూచించారు.



మ్యాప్ ద్వారా మంత్రికి వివరిస్తున్న అధికారులు

కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు..

మచిలీపట్నం నియోజకవర్గంలో లోవోల్టేజి సమస్య నివారణకు కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలని, ఇందుకు ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి రవీంద్ర ఆదేశించారు. గురువారం రాత్రి మంత్రి రవీంద్ర నివాసంలో సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. రుద్రవరం కాలనీలో గృహాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానం

మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రాత్రి సర్వజన ఆసుపత్రి వైద్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాల్లో మార్పు కనిపించాలని ఆదేశించారు. అంబులెన్సులకు దారులు నిర్మించాలని, రైల్వేస్టేషన్‌లో మాదిరిగా ఒకే దగ్గర రోగులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహాప్రస్థానం వాహనాన్ని ఆసుపత్రికి కేటాయించి 24 గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయిని ఆదేశించారు. రోగులకు సహాయకులుగా వచ్చే వారి కోసం డార్మెటరీ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజినీర్లకు సూచించారు. సమావేశాల్లో సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఎంవో డాక్టర్ నిరంజన్, గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ ఏఈ మహేష్, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం, ఈఈలు శ్రీనివాసరావు, బి.వి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు... చక్కదిద్దారు



రాళ్లు, మట్టి పోసి రోడ్డు అంచులను సరిచేశారిలా..



బాగు చేసిన రోడ్డు


వరద గాయం.. దారులు మాయం

స్పందనకు సందర్భం

బుడమేరు వరద విధ్వంసంతో రామవరప్పాడు నుంచి ముస్తాబాద వెళ్లే మార్గం అంచులు కోతకు గురై సుమారు అడుగుల మేర మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈనాడులో సెప్టెంబరు 26న **'వరద గాయం.. దారులు మాయం'** శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కోతకు గురైన రోడ్డు అంచులు రాళ్లు, మట్టితో కప్పివేశారు. దీంతో ప్రమాదం తప్పిందని చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –ఈనాడు, కృష్ణా

పెట్టుబడి కెళితే.. పట్టుబడినట్లే?


ఈనాడు, అమరావతి

'మేం సూచించిన స్టాక్‌లో పెట్టుబడి పెడితే మంచి ఫలితాలు వస్తాయి.. క్రిప్టో ట్రేడింగ్‌లో పెట్టుబడులతో మీరు ఊహించిన దాని కంటే అధికంగా లాభాలు కళ్లజూస్తారు.. అని సామాజిక మాధ్యమాల్లో ఊరించే ప్రకటనలతో కేటుగాళ్లు అమాంతం ముంచుతున్నారు. పెట్టుబడుల పేరుతో పెద్దమొత్తంలో మోసం చేస్తున్న ఘటనలు నగరంలో ఎక్కువ నమోదు అవుతున్నాయి. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించవచ్చని నమ్మించి నిలువునా ముంచుతున్నారు. అధిక రాబడులు వస్తాయనే ఆశతో పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి మోసపోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.'

- భారీగా లాభాలు వస్తాయని వల
- డబ్బు జమ చేశాక స్పందన శూన్యం
- రూ.కోట్లు పోగొట్టుకుంటున్న బాధితులు

సంవత్సరం	2023	2024
ఫిర్యాదులు	338	192
పోగొట్టుకున్న సొమ్ము (రూ. కోట్లలో)	17.01	11.01
రికవరీ (ఇప్పటికి)	56.14 రూ. లక్షలు	1.1 రూ. కోట్లు

✪ గుణదలకు చెందిన ఓ వ్యక్తికి ఇటీవల వాట్సాప్ గ్రూప్ నుంచి సందేశం వచ్చింది. అందులో ఇద్దరు వ్యక్తులు క్రిప్టో కరెన్సీలో ట్రేడింగ్ చేయమని.. ఇందులో మంచి లాభాలు వస్తాయని ఆశ చూపించారు. బాండ్ జోన్స్ అనే ఓ క్రిప్టో కంపెనీ మేనేజర్‌తో మాట్లాడమని నంబరు ఇచ్చారు. వారు చెప్పినట్లే ఆ నంబరుకు వాట్సాప్ కాల్ చేసి మాట్లాడారు. అతను క్రిప్టో ట్రేడింగ్‌కు సంబంధించి ఒక లింక్‌ను పంపాడు. లింక్‌పై క్లిక్ చేసి.. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టమని బాండ్ జోన్స్ సూచించాడు. ఆ మాటలు నమ్మి.. పలు దఫాలుగా ఏడు బ్యాంకు ఖాతాలకు రూ.1.21 కోట్లు దాకా పెట్టుబడి పెట్టాడు. తర్వాత ఈ మొత్తాన్ని డ్రా చేసుకునేందుకు ఫిర్యాదుదారుడు ప్రయత్నించినా సాధ్యం కాని పరిస్థితి. ఈ మొత్తం ఉత్తరాది రాష్ట్రాల్లో వివిధ బ్యాంకుల ఖాతాలకు తరలాయని తెలిసింది. చివరకు తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



✪ కార్మెల్ నగర్‌వాసి ఒకరు ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ మేనేజర్. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన ఉంది. ఈ మధ్య 'వెల్త్ క్లాస్ రూమ్' అనే వాట్సాప్ గ్రూప్ నుంచి సందేశం వచ్చింది. అందులో కొందరు సభ్యులు తాము ప్రఖ్యాత కంపెనీకి ఆర్థిక సలహాదారులమని పరిచయం చేసుకున్నారు. తాము సూచించిన స్టాక్‌లలో పెట్టుబడి పెడితే 30-40 శాతం లాభాలు వస్తాయని నమ్మబలికారు. నిజమని నమ్మి.. వారు ఇచ్చిన 13 బ్యాంకు ఖాతాలకు యాప్ ద్వారా రూ.36.72 లక్షల వరకు డబ్బు జమ చేశాడు. యాప్‌లో రూ.1.24 కోట్లు లాభం చూపగా.. ఆ మొత్తాన్ని డ్రా చేసుకుంటానని పట్టుబట్టడంతో వెంటనే ఆ వాట్సాప్ గ్రూప్‌ను తొలగించారు.

చిన్న మొత్తాలుగా..

పోగొట్టుకుంటున్న సొమ్ము రూ.కోట్లలో ఉంటుండగా.. రికవరీ రూ.లక్షల్లోనే ఉంటోంది. కారణం.. మోసగాళ్లు దోచిన సొమ్మును అనేక బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. ఒక్కో కేసులో సొమ్మును బట్టి సుమారు 40 నుంచి 100 వరకు ఖాతాలకు చిన్న మొత్తాలుగా విభజించి పంపిస్తున్నారు. అక్రమ లావాదేవీల నిర్వహణకు అమాయకుల బ్యాంకు ఖాతాలను వాడుతున్నారు. వారికి డబ్బు ఆశ చూపి మోసగాళ్లే వీటిని నిర్వహిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో అమాయకులే దొరుకుతున్నారు. వీరి పాస్‌బుక్, బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లను తమ ఆధీనంలోనే ఉంచుకొని అంతా నడిపిస్తున్నారు. వీరెవరికి తమ ఖాతాల ద్వారా రూ.లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నట్లు తెలియదు. ఇందుకు ప్రతి నెలా వారికి కొంత నగదు చెల్లిస్తున్నారు.

దర్యాప్తులో అడ్డంకులు..

ఎక్కువ ఖాతాలకు డబ్బు బదిలీ అవుతుండడంతో.. వీటి వివరాలు తీసుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. పైగా అధిక సమయం పడుతుండడంతో దర్యాప్తు, రికవరీకి ప్రతిబంధకంగా ఉంటోంది. చివరకు ఈ నగదును మోసగాళ్లు ఈకామర్స్ సైట్లలో వివిధ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. చాలా సందర్భాలలో క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు చేరుతోంది. డబ్బు పోగొట్టుకున్న వెంటనే బాధితులు 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం లేదు. స్టేషన్‌కు రావడం కూడా ఆలస్యం అవుతోంది. దీని వల్ల రికవరీ శాతం తక్కువగా ఉంటోంది. వేగంగా ఫిర్యాదు చేస్తే.. 60 శాతం వరకు తిరిగి రాబట్టే అవకాశం ఉంది.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.6.26 కోట్లు

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాల్లో దుర్గగుడి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో రెండో విడత గురువారం లెక్కించారు. రెండు విడతల్లో కలిపి రూ.6,26,97,047 ఆదాయం వచ్చింది. బంగారం 412 గ్రాములు, వెండి 15.823 కిలోలు భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. విదేశీ కరెన్సీ 355 యూఎస్ఏ డాలర్లు, 35 ఇంగ్లాండ్ పౌండ్లు, 160 ఆస్ట్రేలియా డాలర్లు, 50 కెనడా డాలర్లు, వచ్చినట్లు ఈవో రామారావు తెలిపారు. మరికొన్ని హుండీలను ఈ నెల 21న లెక్కిస్తారని ఈవో పేర్కొన్నారు. కానుకల లెక్కింపును డిప్యూటీ ఈవో రత్నంరాజు, అధికారులు పర్యవేక్షించారు.



కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

జలవనరుల శాఖలో అదనపు బాధ్యతలు!

ఈనాడు, అమరావతి: జల వనరుల శాఖలో ఇంజినీర్ల కొరత ఉండడంతో పలువురికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ ఈ మేరకు మెమో జారీ చేశారు. ✪ విజయవాడలోని సీఈ కార్యాలయంలో చిన్ననీటి పారుదల విభాగం డీఈఈగా ఉన్న రవికిరణ్ రావెళ్లకు జలవనరుల శాఖ విజయవాడ సర్కిల్ కేసీ డివిజను ఈఈగా ఎఫ్ఏసీ అప్పగించారు. ✪ కేసీ డివిజనులోనే డిప్యూటీ ఈఈగా ఉన్న చెల్లబోయిన గోపీనాథ్‌కు గుడివాడ డ్రెయినేజీ డివిజను ఈఈగా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. ✪ పోలవరం కాలువ గన్నవరం డివిజన్-5కు చెందిన డీఈఈ వీవీ కిశోర్ మేడిశెట్టిని కాకినాడ డ్రెయినేజీ డివిజనుకు ఇన్‌ఛార్జిగా నియమించారు. ✪ సెంట్రల్ డిజైను విభాగం ఎస్ఈ కార్యాలయంలో డీఈఈగా ఉన్న కోటా రీనా విజయవాడ హైడ్రాలజీ విభాగం ఈఈ-2గా ఎఫ్ఏసీ ఇచ్చారు. ✪ విజయవాడలో ప్రాధాన్య ప్రాజెక్టుల పర్యవేక్షణ యూనిట్‌కు ఎస్ఈగా ఉన్న కె.నాగరాజును అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ 2కు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ✪ కృష్ణా పశ్చిమ డివిజను (గుంటూరు) ఈఈ వెంకట రత్నానికి జలవనరుల శాఖ గుంటూరు సర్కిల్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

కట్టనేలేదు.. గుల్లవుతున్నాయ్!

పరిశీలన

ప్రారంభానికి ముందే విలేజ్ క్లినిక్‌లకు నెర్రెలు

ఈనాడు, అమరావతి

గ్రామీణుల చెంతకే వైద్య సేవలు తీసుకొస్తున్నామని గత వైకాపా ప్రభుత్వం హడావుడి చేసింది. ప్రతి 2 వేల మందికి ఒక విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామని నిర్మాణాలు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద పనులు మొదలుపెట్టారు. చాలా చోట్ల ఇవి మధ్యలోనే నిలిచిపోయాయి. తాడిగడప పురపాలికలో విలేజ్ క్లినిక్‌లు గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఇంకా ప్రారంభం కాక ముందే నాసిరకం పనులతో నెర్రెలు ఇచ్చాయి.

2020లో నాటి వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల పేరుతో నిర్మాణాన్ని ప్రారంభించింది. ఒక్కో క్లినిక్‌ను రూ.17.50 లక్షలు ఉపాధి హామీ నిధులను వెచ్చించారు. ఇందులో భాగంగా యనమలకుదురు, కానూరు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో 18 క్లినిక్‌లు నిర్మించాలని తలపోశారు. ఏడు చోట్ల స్థలాలు దొరకలేదు. మిగిలిన చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. 2021లో ఈ ప్రాంతాలన్నీ కలిపి అప్పటి ప్రభుత్వం తాడిగడప పురపాలికగా ఏర్పాటు చేసింది. ఉపాధి నిధులు గ్రామీణ ప్రాంతాల్లోనే వెచ్చించాలి. మున్సిపాలిటీగా ఏర్పాటైన తర్వాత ఏడాది వరకు సాగుతున్న పనులు పూర్తి చేసేందుకు గడువు ఉంది. 2022లో గడువు కూడా ముగిసింది. అయినా నిర్మాణాలు కొలిక్కి రాలేదు. ఉపాధి నిధులు కూడా చాలకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. రెండేళ్లు వీటిని పట్టించుకోలేదు. ఈ భవనాల పనులను వైద్య, ఆరోగ్య శాఖ ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేసి.. నిధుల మంజూరు సంగతి గాలికొదిలేశారు.



ఎక్కడికక్కడ పగుళ్లు



గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు



అసంపూర్తిగా కానూరు-3 విలేజ్ క్లినిక్ భవనం



యనమలకుదురులో సిమెంటు గచ్చు ఇలా..

అరకొర పనులతో మమ అనిపించారు

పనులను గాలికి వదిలేయడంతో భవనాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. దాదాపు రూ.18 కోట్ల పనులపై పర్యవేక్షణ కొరవడింది. పెనమలూరు పోలీసుస్టేషన్ వెనుక ఉన్న కానూరు-3 విలేజ్ క్లినిక్ భవనం పూర్తి అయింది. లోపల ఎలాంటి పనులు చేయలేదు. పలుచోట్ల నాసిరకం పనుల కారణంగా పగుళ్లు ఏర్పడ్డాయి. లోపల ఉన్న సిమెంటు బస్తాలు గడ్డ కట్టాయి. యనమలకుదురులో ఉన్న రెండు క్లినిక్‌లు పనులు పూర్తి కాకుండానే బయట రంగులు వేసి చేతులు దులుపుకొన్నారు. ఇందులో ఓ క్లినిక్ మెట్ల పక్కన పలుచోట్ల పగుళ్లు కనిపిస్తున్నాయి. పోరంకిలోని రెండు క్లినిక్‌లు కేవలం ప్లాస్టరింగ్ చేసి వదిలేశారు. పురపాలికగా మారడంతో వీటిని అర్బన్ క్లినిక్‌లుగా మార్చడంతో పాటు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిదిద్దితే ప్రజలకు ఉపకరించే వీలుంది.

నగరంలో శ్రీవారి లడ్డూ

విజయవాడ సిటీ: ఎంజీ రోడ్డులోని తితిదే కల్యాణ మండపంలో వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కౌంటర్‌లో శుక్రవారం మూడు వేల శ్రీవారి లడ్డూలు అందుబాటులో ఉంటాయని తితిదే విజయవాడ గ్రూప్ దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 8.30 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు.

జెత్వానీ కేసులో నిందితుడికి రిమాండ్ పొడిగింపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్ రిమాండ్‌ను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించారు. తనను, తన కుటుంబ సభ్యులను ఇబ్రహీంపట్నం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ నటి జెత్వాని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేశారు. మొదటి నిందితుడిగా అరెస్టైన అతడు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రిమాండ్ గడువు ముగియడంతో.. గురువారం 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం.. ఆయన రిమాండ్‌ను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి యు.రామ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా విద్యాసాగర్ బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై వాదనలు వినేందుకు కేసును ఈ నెల 23వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు



కేడీసీసీ బ్యాంకు మోపిదేవి శాఖ భవనం ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి, జేసీ గీతాంజలిశర్మలు

మోపిదేవి, న్యూస్‌టుడే: సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మోపిదేవిలో రూ.1.09 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మోపిదేవి శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జేసీ, కేడీసీసీ బ్యాంకు పర్సన్‌ఇన్‌ఛార్జి గీతాంజలి శర్మలు పాల్గొని కౌంటరు, లాకరు గదులు ప్రారంభించారు. మంత్రి కొల్లు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేసిందని, దీంతో రైతులకు ఆ వ్యవస్థపై నమ్మకం పోయిందని, మళ్లీ వారిలో విశ్వాసం కల్పించేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జోడీతో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గత అయిదేళ్లూ ఎన్నికలు దాటవేస్తూ వచ్చి త్రిసభ్య కమిటీల పేరుతో కాలయాపన చేసి అనేక అవకతవకలకు పాల్పడ్డారని, వాటిపై దర్యాప్తు జరిపించి బాధ్యుల నుంచి నిధులు రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. మోపిదేవి శాఖ రైతులకు మెరుగైన సేవలందించి జిల్లాలో నంబరు -1 స్థానంలో ఉండాలని సూచించారు. మండలి వెంకట్రామ్, కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామమనోహర్, జీఎం చంద్రశేఖర్, ఏజీఎం ప్రకాశరావు, చల్లపల్లి మోపిదేవి శాఖల మేనేజర్లు నగరాజకుమారి, సుల్తానా సయ్యద్, ఎంపీపీ దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జునరావు, జనార్ధనరావు, తహసీల్దార్ శ్రీవిద్య, నాగేశ్వరరావు, అంజయ్య, బాబాప్రసాద్, సర్పంచి మేరీరాణి, పవన్‌కుమార్, కూటమి నేతలు, సహకార సంఘ ప్రత్యేక అధికారులు, సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



రేకుల షెడ్‌లో ఉండలేక బయట నిలబడిన ప్రయాణికులు



పని చేయని టీవీ



ఫ్యాన్లు ఉన్నా తిరగవు...

కూర్చోలేరు.. సేదతీరలేరు..!

కంకిపాడు బస్టాండులో సమస్యల కూత

బస్సులు ఆలస్యమైనా, ఎక్కువ సమయం నిలబడలేని ప్రయాణికులు సేదతీరేందుకు బస్టాండును ఆశ్రయిస్తారు. కానీ కంకిపాడు బస్టాండులో కూర్చోలేరు. ఎందుకంటే అక్కడ కనీస వసతులు లేవు. అసలే రేకుల షెడ్డు. ఫ్యాన్లు తిరగవు. ఉక్కపోతకు ఉండలేరు. చేసేది లేక.. బయటకు వచ్చి నిలబడుతున్నారు. టీవీ చూద్దామన్నా.. పనిచేయవు. మూడింటిలో ఒకటే పనిచేస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణ అంతంతే. దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇలా వివిధ రకాల సమస్యలతో బస్టాండు కొట్టుమిట్టాడుతోంది. కృష్ణా జిల్లాలో ఇది కీలకమైనది. దీని మీదుగా జిల్లా నలువైపులా సర్వీసులు నడుస్తుంటాయి. రోజూ 400 ట్రిప్పుల వరకూ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. గన్నవరం, గుడివాడ, ఉయ్యూరు, అవనిగడ్డ, మచిలీపట్నం, విజయవాడ, భద్రాచలం, హైదరాబాద్ వంటి దూరప్రాంత సర్వీసులు నడుస్తున్నాయి. విజయవాడకు 20 కి.మీ. దూరంలోనే ఇది ఉన్నా.. అభివృద్ధికి నోచుకోలేదు. ఇంకా రేకుల షెడ్‌లోనే కొనసాగుతోంది. పక్కా భవనం దిశగా చర్యలు చేపట్టలేదు. వర్షంపడితే ఆవరణ చెరువును తలపిస్తుంది. లోపల ప్రాంగణాన్ని ఎత్తు చేసి.. పక్కా భవనం నిర్మించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ఈనాడు, అమరావతి

రెండు బ్యాంకు శాఖల ఏర్పాటుకు అనుమతి

ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో రెండు నూతన బ్యాంకు శాఖలు త్వరలో ప్రారంభించనున్నట్లు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలంలోని కుందేరు, అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలంలోని రామకృష్ణాపురం గ్రామాల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలు ప్రారంభించేందుకు ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఆయా గ్రామాల ప్రజల ఆర్థిక అభ్యున్నతి కోసం బ్యాంకులు ఏర్పాటు చేస్తామని, ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్‌లతో కలిసి వాగ్దానం చేశామన్నారు. ఇచ్చిన మాట మేరకు దిల్లీ, ముంబయిలో తనకు బ్యాంకు ఉన్నతాధికారులతో ఉన్న పరిచయాలతో వారిని కలిసి ఒప్పించినట్లు పేర్కొన్నారు. బ్రాంచ్‌ల ఏర్పాటుపై విజయవాడలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ బంగార్రాజు తదితరులు త్వరలో ప్రకటిస్తారని తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో తగిన స్థలం గుర్తించి నూతన భవన నిర్మాణాలకు టెండర్లు పిలవడం లేదా బ్యాంకుకు అవసరమైన అద్దె భవనాలను గుర్తించి త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమాలపై విచారణ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు అనగాని, కొల్లు, ఎమ్మెల్యే రాము

కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన భూదందాలు, అక్రమాలపై విచారణ జరుగుతోందని, రంగులు, రాళ్లపై బొమ్మలకు రూ.వందల కోట్లు వృథా చేశారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని కౌతవరంలో నూతనంగా నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం, స్మార్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన షెటిల్ బ్యాడ్మింటన్ కోర్టును మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములతో కలిసి ఆయన ప్రారంభించారు. మంత్రి అనగాని మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, పెట్టుబడులు తెచ్చి పరిశ్రమలు స్థాపించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే జనవరి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. వరదలు వచ్చినప్పుడు హెలికాప్టర్లలో తిరిగిన జగన్‌కు, ఇటీవల వరద నీళ్లలో తిరిగి రూ.600 కోట్ల సాయమందించిన చంద్రబాబుకు తేడాను ప్రజలు గుర్తించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గుడివాడకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్న రాముకు అందరూ అండగా ఉంటామన్నారు. తాలూకా ఎన్టీఆర్, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు నివాళులర్పించారు. జేసీ గీతాంజలిశర్మ, ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జిల్లా పాలనమండలి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి శాయన పుష్పావతి, జనసేన, భాజపా నియోజకవర్గ బాధ్యులు బూరగడ్డ శ్రీకాంత్, దావులూరి సురేంద్రబాబు, భాజపా, తెదేపా నాయకులు రవీంద్రబాబు, సుబ్రహ్మణ్యం చౌదరి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ఐసీడీఎస్ సిబ్బందితో కలెక్టర్ డీకే బాలాజీ

కానూరు: జిల్లాలోని స్త్రీ, శిశు సంరక్షణ కేంద్రాల్లో చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ఆ శాఖ సిబ్బందిదేనని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కానూరు ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీపీవో సత్యవతి, డీసీపీవో మోనిష పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్ సేవలు విస్తరిస్తాం



వికాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కె.నారాయణ

చల్లపల్లి, న్యూస్‌టుడే: చండ్ర రాజేశ్వరరావు(సీఆర్) ఫౌండేషన్ సేవలు మరింత విస్తరిస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ తెలిపారు. చల్లపల్లిలోని చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి అక్కడ అందుతున్న సేవలు గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. నారాయణ మాట్లాడుతూ హైదరాబాద్‌లోనూ సీఆర్ ఫౌండేషన్ స్థాపించి సేవలు విస్తరింపచేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థలం మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశామన్నారు. సీపీఐ నాయకులు అక్కినేని చంద్రరావు, అడ్డాడ ప్రసాద్‌బాబు, మహిళా సమైక్య జిల్లా నాయకులు మల్లుపెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్స్నాదేవి, సీపీఐ నాయకులు మల్లుపెద్ది అజయ్‌కుమార్, మల్లుపెద్ది బోసు, గంగాధరరావు, నాగమల్లి, కొల్లూరి శ్రీధర్ పాల్గొన్నారు. ❖ ఘంటసాల మండలం గోగినేనిపాలెంకు చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు అత్తలూరి గోపాలకృష్ణను సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ గురువారం పరామర్శించారు.

భౌగోళిక మార్పులకు ఆర్కిటెక్చర్ అద్దం



పట్టాలందుకున్న ఆనందంలో కేరింతలు



మాట్లాడుతున్న ప్రేమేంద్ర రాజ్ మెహతా, వేదికపై రమేష్ శ్రీకొండ, అమోగ్ కుమార్ గుప్తా తదితరులు

కరెన్సీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి జీవితంలో గ్రాడ్యుయేషన్ కీలక ఘట్టమని డిజైన్ యాక్షన్ గ్రూప్ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇండియా(దిల్లీ) మాజీ అధ్యక్షులు ఎ.ఆర్.ప్రేమేంద్రరాజ్ మెహతా అన్నారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) 8వ స్నాతకోత్సవం గురువారం సంస్థలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రేమేంద్రరాజ్ మెహతా మాట్లాడుతూ.. ఆర్కిటెక్చర్, ప్లానింగ్ వృత్తులు అసాధారణమైనవని, పట్టణాల భౌగోళిక మార్పులకు అవి అద్దం పడతాయన్నారు. సృజనాత్మక అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి స్పా విజయవాడ సాధించిన సమగ్ర నివేదికను డైరెక్టర్ రమేష్ శ్రీకొండ వివరించారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన వివిధ అవార్డులను ఆయన వెల్లడించారు. మొత్తం 253 మంది విద్యార్థులకు పట్టాలు బహూకరించారు. 2023-24 విద్యా సంవత్సరానికి 10 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 10 మందికి ఉత్తమ పరిశోధన అవార్డులు ప్రదానం చేశారు. స్నాతకోత్సవానికి స్పా విజయవాడ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ అమోగ్‌కుమార్ గుప్తా అధ్యక్షత వహించగా, ఆచార్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

20న నాలుగు అంశాల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 20న నాలుగు అంశాల్లో నిర్వహించనున్నట్లు ఆ పాఠశాలల జిల్లా సమన్వయకర్త కె.ప్రేమావతి తెలిపారు. సైన్స్ (వ్యవసాయం, శక్తివనరులు, ఆరోగ్యం), సోషల్ సైన్సెస్, లెక్కలు, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అంశాలపై గన్నవరం సమీప వీరపనేనిగూడెంలో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు విద్యార్థుల నమోదు, 9 గంటలకు ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్లుగా, 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులు సీనియర్ విభాగంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల ఆర్ట్స్, క్రాఫ్ట్స్, సంగీత నైపుణ్యాలపై పోటీలు ఉంటాయని తెలిపారు.

కృషి, పరివర్తనకు వాల్మీకి మహర్షి ఆదర్శం



కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: కృషితో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహర్షి వాల్మీకి అని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడారు. తాను తప్పు చేస్తున్నానని తెలుసుకుని పరివర్తన చెందడంతో పాటు రామాయణం లాంటి మహాకావ్యాన్ని రచించారంటే ఆయన కృషి అర్థం చేసుకోవచ్చన్నారు. ఆయనతో పాటు కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, పలువురు ఉద్యోగులు వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పించారు. * వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి, బోయ సంఘ నాయకులు కె.రామకృష్ణ, బ్రహ్మానందంలు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి జి.రమేష్ బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిదూర్జటి తదితరులు ప్రసంగిస్తూ వాల్మీకి విశిష్టతను వివరించారు.

చోడవరం రైతుకు కర్మవీరచక్ర అవార్డు



రఘువీర్

పెనమలూరు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరం గ్రామ రైతు నందం రఘువీర్ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఐక్యరాజ్యసమితి, కర్మవీరచక్ర గ్లోబల్ ఫెలోషిప్ సంస్థల భాగస్వామ్యంతో పలు అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థలు ఇచ్చే కర్మవీర్‌చక్ర అవార్డు(2024-25)కు రఘువీర్‌ను వరించింది. ఈ మేరకు ఆయనకు సదరు సంస్థ నుంచి సమాచారం అందింది. పురాతన వంగడాలను పరిరక్షించడం, పునరుద్ధరించడంతో పాటు వాటిని కాపాడటం అన్న అంశాలకుగాను ఈ అవార్డు దక్కింది. ఈ పురస్కారాన్ని వచ్చే నెల నవంబర్ 25న దిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. గతేడాది ఈ అవార్డు సేంద్రియ సాగు నిర్వహిస్తున్న అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలానికి చెందిన రైతు నారాయణప్పకు దక్కింది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

అగ్నిమాపక కేంద్రాల అభివృద్ధికి రూ.252 కోట్లు



సిబ్బందికి సూచనలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అదనపు సంచాలకులు శ్రీనివాసులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.252 కోట్లు విడుదలైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అదనపు సంచాలకులు జ.శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన గుడివాడ అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో పలు పరికరాలను, జిమ్‌ను పరిశీలించారు. ఇటీవల బుడమేరు వరదల కారణంగా గుడివాడ అగ్నిమాపక సిబ్బంది అందించిన సేవలను అభినందించారు. కేంద్రం దస్త్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక సంఘ నిధులతో రాష్ట్రంలో 17 అగ్నిమాపక కేంద్రాల నిర్మాణాలు, 38 కేంద్రాల ఆధునికీకరణ పనులతో పాటు నూతన సాంకేతికతో అగ్నిమాపక వాహనాలు, పరికరాలను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి జె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పోలీసుస్టేషన్ల వద్ద సీసీ కెమెరా నిఘా

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లాను రాష్ట్రంలోనే మోడల్ పోలీసింగ్ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎస్పీ గంగాధరరావు అన్నారు. కంకిపాడు పోలీసుస్టేషను పరిధిలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పర్యవేక్షణ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోనే కంకిపాడు పోలీసుస్టేషనులో తొలివిడత 25సీసీ కెమెరాలతో పటిష్ఠ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు ఎస్సై సందీప్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రధానంగా ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతోపాటు దాతలతో మాట్లాడి నిధులు సమకూర్చారన్నారు. వీటిని ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లోనే స్టేషను పరిధిలో సుమారు రూ.40 లక్షల విలువైన 58 మోటారు సైకిళ్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు, సీఐ జె.మురళీకృష్ణ, ఎస్సై తాతాచార్యులు, ఉయ్యూరు రూరల్ ఎస్సై సురేష్‌బాబు పాల్గొన్నారు.

క్షిపణి పరీక్షా కేంద్రం రాకతో జిల్లాకు మేలు

అవనిగడ్డ: నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్షా కేంద్రం రావడంతో జిల్లాకు మహర్దశ వస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ చెప్పారు. ఆయన డీఆర్‌డీవో సౌత్ ఇండియా సీసీఈ హెడ్ యాగయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే క్షిపణి కేంద్రం జిల్లాకు రావడం విశేషమని చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మౌలిక వసతులు మెరుగుపడి కొత్త పరిశ్రమలు వస్తాయని చెప్పారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లికి రూ.5లక్షల విరాళం



శిక్షకుడు బిల్ ఓడెన్‌డాల్‌తో నాదెళ్ల సురేష్

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ చల్లపల్లి కోసం జన్మభూమి రుణం తీర్చుకోవాలనే తపనతో అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు నాదెళ్ల సురేష్.. అమెరికాలో తీవ్రమైన ఉష్ణోగ్రతలో ప్రత్యేక శిక్షకుడు బిల్ ఓడెన్‌డాల్ పర్యవేక్షణలో 100 కి.మీ పరుగుపెట్టి రూ.5 లక్షల విరాళాలు సేకరించారు. చెక్కును గురువారం 'స్వచ్ఛ చల్లపల్లి' కార్యక్రమంలో తన తల్లిదండ్రులు పూర్ణచంద్రరావు-కుసుమకుమారిల ద్వారా రథసారథులు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతిల దంపతులకు అందించారు.

కౌలురైతు బలవన్మరణం

గోసాల (పెనమలూరు), న్యూస్‌టుడే: కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గోసాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రవికుమార్(35) కౌలుకు వ్యవసాయం చేస్తుంటారు. ఆయన ఈ నెల 15న రాత్రి 11 గంటల సమయంలో పురుగుమందు తాగి వాంతులు చేసుకుంటుండగా భార్య, కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. దీనిపై కుటుంబ సభ్యులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప్పలూరు-నిడమానూరు రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గురువారం ఓ వ్యక్తి(40) మృతి చెందాడు. మృతుడి కుడి చేతికి స్టీలు కడియం, ఎరుపు రంగు తాడు ఉంది. పొగాకు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ముఖం గుర్తుపట్టలేని విధంగా పాడయ్యింది. మృతుడి వివరాలు తెలిస్తే గుడివాడ రైల్వే పోలీసు ఎస్సై 94406 27570 నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

మోసం చేద్దామనుకొని.. ఖాకీల చేతికి చిక్కి..

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : డోర్ డెలివరీని అడ్డం పెట్టుకొని సరకుల కొనుగోలు అనంతరం నగదు చెల్లించకుండా ఉడాయించేందుకు యత్నించిన వ్యక్తిని పోలీసులకు అప్పగించిన ఘటన గన్నవరం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిమర్రుకు చెందిన ఇమ్మడి శివగణేష్ జల్సాలకు అలవాటుపడ్డాడు. బైక్ చోరీల కేసులో జైలు జీవితం అనుభవించాడు. అనంతరం డాక్టర్, అధికారిని అంటూ మోసాలకు పాల్పడుతూ జీవనం సాగిస్తున్నాడు. గన్నవరం పట్టణంలోని ఓ కిరాణా దుకాణం వద్దకు బుధవారం మధ్యాహ్నం వచ్చిన శివగణేష్. . సుమారు రూ.15 వేల విలువైన నిత్యావసరాలను డోర్ డెలివరీ ఇవ్వాలని కట్టించాడు. పాత తెదేపా కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ఓ బహుళ అంతస్తు వద్దకు సరకులతో వ్యాపారి చేరుకోగానే నగదు తీసుకొని వస్తానని అపార్ట్‌మెంట్ లోపలకు వెళ్లాడు. మూడో అంతస్తు వద్ద నివాసితులు ఎవరు.. ఎందుకు వచ్చారని ప్రశ్నించడంతో అక్కడి నుంచి ఉడాయించేందుకు ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. డోర్ డెలివరీ పేరుతో నకిలీ అడ్రస్ చెప్పి సరకులతో పరారయ్యేందుకు శివగణేష్ యత్నించి స్థానికులకు చిక్కినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై చీరాలలో మోసాలకు పాల్పడిన, సెల్‌ఫోన్ చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా తాజా ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. దీంతో చీరాల పోలీసులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

ప్రత్యేక కేంద్రాల ద్వారా సరకుల పంపిణీ

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పెరుగుతున్న ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్కువ ధరలకు పలు నిత్యావసర సరకులు అందిస్తున్నట్లు డీఎస్‌వో పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతుబజార్లు, సూపర్‌మార్కెట్లు, టోకు వర్తకుల ద్వారా మొత్తం 27 ప్రత్యేక కేంద్రాల్లో కందిపప్పు, బియ్యంతో పాటు సన్‌ఫ్లవర్‌నూనె, పామాయిల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124, పామాయిల్ రూ.114 చొప్పున ఒకొక్కరికీ అందిస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సంక్షేమ బోర్డు తిరిగి కొనసాగించాలి

బంటుమిల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధికారంలో ఉన్న సమయంలో పలు మెమోలను తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన రాయితీలను నిలుపుదల చేసిందని భవన నిర్మాణ కార్మికులు అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మెమోలను రద్దు చేసి సంక్షేమ బోర్డును కొనసాగించాలని కోరుతూ నాయకులు, కార్మికులు గురువారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కొమ్మాలపాటి రవి, యర్రంశెట్టి బాబురావు, సూరిబాబు, బాల సుబ్రహ్మణ్యం, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? రుద్రవరంలో టిడ్కో గృహ సముదాయం వద్ద వివిధ ప్రాంతాల్లో ముళ్లపొదలు వ్యాపించాయి. లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయకముందే వాటిని తొలగించాలి. **-స్థానికులు**



✔ టిడ్కో అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తాం.

-బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

? బందరు మండలం అరిశేపల్లి పంచాయతీ పరిధిలోని గంట్లమ్మపాలెం గ్రామంలో రోడ్డు పక్కన వేసిన చెత్త మేటవేసుకుపోయింది.

-గ్రామస్థులు

✔ సిబ్బందిని పంపి వెంటనే చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

-సుకుమార్, పంచాయతీ కార్యదర్శి

? పెడన మండలం కమలాపురం వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా కోతకు గురై అంచులు పొలాల్లోకి జారిపోయాయి.

-కొట్టే సాయికుమార్, కమలాపురం, పెడన మండలం



✔ సమస్య మా దృష్టికి వచ్చింది. మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించాం. వెంటనే గుత్తేదారుకు పనులు అప్పగించి రోడ్డు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నాం. **-కాగిత కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే**

స్పందనకు వందనం

నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంతంలోని డ్రైన్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకురాగా ఈనాడులో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

-మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే

? పెడన 4వ వార్డు పాతపేటలో త్రీఫేజ్ విద్యుత్తు లైన్లు లేక ఇబ్బందిగా ఉంది. **-యోగానంద్**

✔ స్థానికులు ఈ సమస్య మా దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

-పోలగాని ఏడుకొండలరావు, విద్యుత్తు ఏఈ

? పెడన మఠం రోడ్డు ఆక్రమణలకు గురై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి.

-శశిరేఖ, పెడన

✔ ఈ రహదారిని విస్తరించాలన్న ప్రతిపాదన ఉంది. త్వరలో ఆక్రమణలన్నింటిని తొలగిస్తాం.

-సృజనకుమారి, టౌన్ ప్లానింగ్ అధికారిణి.

-న్యూస్‌టుడే, పెడన

? కమలాపురం బంటుమిల్లి కాలువ వంతెన వద్ద చెన్నూరు రహదారి కోతకు గురై అత్యంత ప్రమాదకరంగా మారింది. **- గుడిశేవ శ్రీనివాసరావు, కమలాపురం సర్పంచి**

✔ ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధంగా ఉన్నాయి.

- సీహెచ్.కిషోర్, ఆర్అండ్‌బీ ఏఈ, పెడన

? నందమూరు- గొడపాలెం వరకు జడ్పీ రహదారి అసంపూర్తిగా నిర్మించారు. ఒక పొర మాత్రమే వేయడంతో గుంతలు పడి పోయింది.

-స్థానికులు

✔ రూ.2కోట్లతో ఐదు కి.మీ మేర రహదారి అసంపూర్తిగా నిర్మించారు. పాత గుత్తేదారు పని చేయడానికి ముందుకొచ్చారు.

త్వరలో రహదారి నిర్మాణం పూర్తి స్థాయిలో జరుగుతుంది. **-వేముల సత్యనారాయణ, అచ్చయ్యవారిపాలెం సర్పంచి**

- న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

? వర్షం కారణంగా బంటుమిల్లిలోని మసీదు ఎదురు వీధిలో మురుగు నీరు పొంగి రోడ్డుపైకి చేరుతోంది. **-ఇద్రిస్, బంటుమిల్లి.**

✔ సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం. **-డి.ఝాన్సీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, బంటుమిల్లి.**

? మల్లపరాజుగూడెంలో ప్రధాన రోడ్డు వెంబడి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **-సూర్య**

✔ వ్యర్థాలు ఆ ప్రాంతంలో వేయకుండా చర్యలు తీసుకుంటాం.-దూసనపూడి అవతారం, సర్పంచి, మల్లపరాజుగూడెం. **- న్యూస్‌టుడే, బంటుమిల్లి**

? చెన్నూరు-చేవూరు మధ్యలో ర్అండ్‌బీ రహదారి కోతకు గురవుతోంది. **-స్థానికులు,**

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.-జయరామ్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పెడన **–న్యూస్‌టుడే, పెడన గ్రామీణం**

రక్షిత జలం.. పల్లెకు వరం..



న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు

గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు అలంకారప్రాయంగా మారాయి. వైకాపా పాలకులు వీటిని పట్టించుకోకపోగా పంచాయతీలకు మంజూరయ్యే ఆర్థిక సంఘం నిధులు మళ్లించడంతో సర్పంచులు ఏమీ చేయలేని స్థితిలో వాటిని అలాగే వదిలేశారు. ప్రధానంగా నీటిని శుద్ధి చేసే ఫిల్టర్‌బెడ్లు పాడైపోయాయి. దీంతో రక్షిత నీటి పథకాలకు అనుబంధంగా ఉన్న చెరువుల వద్ద బోర్లు వేసి తాగు నీరు అందిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫిల్టర్‌బెడ్లు అన్నింటినీ వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఆ దిశగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు చేపట్టారు.

రెండు నియోజకవర్గాల్లో 99 పథకాలు..

★ బందరు, పెడన నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో మొత్తం 99 రక్షిత నీటి పథకాలు ఉన్నాయి. సామూహిక రక్షిత నీటి పథకాలు మినహా మిగిలిన గ్రామ రక్షిత నీటి పథకాలకు చెందిన ఫిల్టర్‌బెడ్లు అన్నీ పాడైపోయాయి.



గూడూరు: మద్దిపట్లలో అలంకారప్రాయంగా..

★ గూడూరు మండలంలోని గూడూరు, మద్దిపట్ల, పోలవరం, రాయవరం, కప్పలదొడ్డి తదితర గ్రామాల్లో ఈ సమస్య ఉంది. ★ పెడన మండలంలోని చేవెంద్ర, నడుపూరు, చెన్నూరు తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ★ బంటుమిల్లి మండలంలోని ముంజులూరు, పెందుర్రు, పెదతుమ్మిడితోపాటు అనేక గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్లు పాడై ఏళ్లు గడిచిపోతోంది. బందరు మండలంలోని సుల్తానగరం, గుండుపాలెం తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రక్షిత నీటి పథకాలను పంచాయతీలే పర్యవేక్షించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతుంటే పంచాయతీల్లో ఆదాయం లేదని సిబ్బంది పట్టించుకోకుండా వదిలేశారు. మరమ్మతులు చేయించాలని వైకాపా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో చేసేది లేక బోర్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. అవి తాగడానికి అనువుగా లేకపోవడంతో ప్రజలు వాడుక నీరుగా వినియోగిస్తున్నారు.



పెడన: కూడూరులో నిరుపయోగంగా రక్షిత నీటి పథకం

వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు..

★ రక్షిత నీటి పథకాల సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఫిల్టర్‌బెడ్లను వినియోగంలోకి తెచ్చి శుద్ధజలం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. పథకాల పర్యవేక్షణ బాధ్యత పంచాయతీలదే అయినా ఆ దిశగా పూర్తి స్థాయిలో చర్యలు ఉండడం లేదు. ★ నిబంధనల ప్రకారం ప్రతి ఓవర్‌హెడ్ ట్యాంకు 15 రోజులకోసారి శుభ్రం చేసి తేదీతో సహా అక్కడ నమోదు చేయాలి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ దిశగా ఎక్కడా జరగలేదు. ప్రభుత్వం ఆదేశించడంతో పాటు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో ఇటీవల ఆయా ప్రాంతాల్లోని అన్ని ట్యాంకులను శుభ్రం చేసే పనులు చేపట్టారు. ★ ఇటీవల ఎక్కడెక్కడ కొత్తగా ఫిల్టర్‌బెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎన్నిచోట్ల మరమ్మతులు చేయాల్సి ఉందో గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో కూటమి ప్రభుత్వ హయాంలో ఫిల్టర్‌బెడ్‌ల సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇంటింటికీ సంక్షేమం.. ప్రతి ఊరూ అభివృద్ధి



కప్పలదొడ్డి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత, వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు

గూడూరు,న్యూస్‌టుడే: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రతి ఊరిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం గూడూరు, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు వైకాపా రాక్షస పాలనతో ఇబ్బందులు పడిన ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందిస్తామని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు లింకేజీ రుణాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. తెదేపా, జనసేన, భాజపా మండల అధ్యక్షులు పోతన లక్ష్మీనరసింహస్వామి, దాసరి ఉమాసాయిరామ్, కోలపల్లి రజనీకుమార్, సర్పంచులు లింగం సులోచనారాణి, మహ్మద్‌రఫీ, యక్కల మాధవి, గోవాడప్రేమ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పేరిశెట్టి తేజోవతి, కోళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది ప్రగతి పాలన

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: పాలన ఎలా ఉండాలో, అభివృద్ధి అంటే ఏమిటో చంద్రబాబు, పవన్ చేసి చూపిస్తున్నారని తెదేపా నేతలు గోపు సత్యనారాయణ, కాగిత వేంకటేశ్వరరావు కొనియాడారు. పల్లెపండగలో భాగంగా గురువారం చిన్నాపురం, గుండుపాలెం, రుద్రవరం గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, వేంకటేశ్వరరావు మాట్లాడుతూ వైకాపా పాలనలో అభివృద్ధి మచ్చుకైనా కానరాలేదని విమర్శించారు. తీర గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి తొలగించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర పెదయాదర వద్ద 70ఎకరాల చెరువు ఏర్పాటు చేసి అక్కడ నుంచి పైపుల ద్వారా ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మంచి నీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. శంకుస్థాపన కార్యక్రమాల్లో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు కుంచె దుర్గాప్రసాద్(నాని), తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గుండుపాలెం: భూమి పూజలో కూటమి నేతలు

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెదేపా శిష్టకరణం సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అక్కు మహంతి రాజా అన్నారు. ఆయనతో పాటు 26వ డివిజన్‌కు చెందిన పలువురు కూటమి నాయకులు గురువారం కోనేరుసెంటరులో పర్యటించి పరిశుభ్రతపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ దుకాణాల వద్ద ఎక్కువగా చెత్త పేరుకుపోతోందని, వాటిని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. నాయకులు అబ్దుల్‌అజీమ్, షేక్‌మౌలాలి, చంటి, రఘురామ్, బాషా, వన్నెంరెడ్డి ప్రసాద్, ఎం.ప్రసాద్, యుగంధర్, ఎండీ జిలాని, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



హెచ్‌ఎం, పీడీలతో మాట్లాడుతున్న మహబూబ్‌బాషా

పెడన, న్యూస్‌టుడే: బాలబాలికలకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందేలా అవసరమైన మౌలిక సదుపాయాల్ని కల్పించనున్నామని ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా అన్నారు. స్థానిక జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్తు హైస్కూలును గురువారం సందర్శించిన ఆయన నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లతో క్రీడా సదుపాయాలపై సమీక్షించారు. గూడూరు మండలం కప్పలదొడ్డి హైస్కూల్లోనూ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హెచ్‌ఎం తీర్థావతి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురళీకృష్ణ,పెడన పీడీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలను మహబూబ్ బాషా సందర్శించి వ్యాయామ ఉపాధ్యాయుల రికార్డులు తనిఖీ చేశారు. వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. పీఈటీల సంఘం నాయకులు సింహాద్రి గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు చింతా మురళి, మత్తి అరుణ, చిలుకోటి రాజేష్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటుకున్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్, కోచ్

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని నిర్మలా స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటుకున్నారు. ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఆల్ ఇండియా మవాతేక షిటోరియో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి తమ ప్రత్యేకతను చాటి చెప్పారు. పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించడంపై ప్రిన్సిపల్ సుధాసుశాయ్ అభినందనలు తెలిపారు. విద్యార్థులతో పాటు కోచ్ వెంకటేశ్వరరావును ప్రిన్సిపల్ ప్రశంసించారు.

ఊరచెరువులో పడి ఒకరి మృతి

మాట్లం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మాట్లం గ్రామానికి చెందిన తిరుమాని చినరామయ్య (47) మద్యం మత్తులో ఊర చెరువులో పడి మృతి చెందారు. చినరామయ్య బుధవారం రాత్రి చెరువు వద్ద మద్యం తాగుతూ కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. గురువారం సాయంత్రం గ్రామంలోని చెరువులో మృతదేహం తేలియాడుతున్న విషయం అక్కడున్న గ్రామస్థులు గమనించి పంచాయతీ కార్యదర్శి చిరంజీవికి తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి బంధువులకు అప్పగించారు. చినరామయ్య భార్య కువైట్‌లో ఉండగా, ఇద్దరు ఆడపిల్లలు హైదరాబాదులో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నట్లు తెలిపారు.

వాల్మీకి కారణజన్ముడు



ప్రసంగిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పీబీ సాల్మన్

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మహర్షి...తపశాలి వాల్మీకి అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పీబీ సాల్మన్ అన్నారు. నగరంలోని లేడియాంప్తిల్ కళాశాలలో గురువారం నిర్వహించిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని అందించిన కారణజన్ముడని కొనియాడారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ వి.సుందరలక్ష్మి వాల్మీకి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాథ్‌బాబు, అధ్యాపకులు విజయశ్రీ, మమత, కల్యాణి, సోమసుభాషిణి, సాజిదా, సురేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రోజారమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.వరలక్ష్మి, అసోసియేట్ ప్రోగ్రాం అధికారి ఎం.శైలజలు వాల్మీకి గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీడీ ఎస్.వెంకట్రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

పెడన, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి పురాణ ఇతిహాసాల్లో ప్రముఖుడిగా ఖ్యాతి పొందారని మున్సిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

బంటుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వాల్మీకి జయంతి ప్రిన్సిపల్ జగన్మోహనరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.



జయంతి వేడుకల్లో కమిషనర్, అధికారులు

విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నందున, వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. గురువారం ఆయన నగరంలోని రుస్తుంబాద బాలురు, బాలికల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలతో పాటు లేడియాంప్తిల్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. భోజనం బావుంటోందా, మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా తదితర అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. ప్రభుత్వం పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నందున వినియోగించుకోవాలని, నాణ్యత లోపాలు ఉన్నా, ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ఉచితంగా న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




భోజనం వడ్డిస్తున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

పెండింగ్ బిల్లులపై ఆళ్ల పోరాటం అసామాన్యం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: నీరు-చెట్టు పథకానికి సంబంధించి పెండింగులో ఉన్న బిల్లుల కోసం సాగు నీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ వైకాపా ప్రభుత్వంపై చేసిన పోరాటం అసామాన్యమైందని మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు. గురువారం ఆళ్ల గోపాలకృష్ణ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ యనమద్ది పుల్లయ్యచౌదరి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు మంత్రి రవీంద్రను మచిలీపట్నం నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతుల తరపున 9391 రిట్‌పిటిషన్లు, 6625 ధిక్కార పిటిషన్లు వేశామని, కోర్టు ఆదేశాల మేరకు రూ.968 కోట్లు వైకాపా ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. మచిలీపట్నం పార్లమెంటు తెదేపా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

భూకబ్జా ఆరోపణలు అవాస్తవం

పెడన, న్యూస్‌టుడే: మాజీ మంత్రి జోగి రమేష్ అండతో తాము మామిడి సత్యనారాయణకు చెందిన భూమిని కబ్జా చేశామన్న ఆరోపణలు అవాస్తవమని పెడన మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి భర్త, 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో పెడనకు చెందిన మామిడి సత్యనారాయణ కౌన్సిలర్‌తో పాటు మరికొందరు వైకాపా నేతలపై మంగళవారం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో స్థానికంగా కౌన్సిలర్ కటకం ప్రసాద్‌తో పాటు వైస్‌ఛైర్మన్ ఖాజా, ఆర్యవైశ్య సంఘ నేతలు కొల్లూరి సత్యనారాయణ, తమ్మిన వెంకట సుబ్బారావు తదితరులు స్పందించారు. కౌన్సిలర్ మరికొందరు వైకాపా నేతలపై సత్యనారాయణ చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. అసత్య ఆరోపణలు చేసి పరువుకు భంగం కల్గించిన సత్యనారాయణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై జి.సత్యనారాయణకు గురువారం ఫిర్యాదు అందజేశారు.



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న వైస్‌ఛైర్మన్, కౌన్సిలర్, ఆర్యవైశ్య సంఘ నేతలు

సమస్యలతో సతమతం.. చూపాలి పరిష్కారం..

న్యూస్‌టుడే, బంటుమిల్లి

అన్ని ఇళ్లకు కుళాయిలు ఇవ్వాలి

డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలి

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బంటుమిల్లిలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ప్రధానంగా మురుగు పారుదల వ్యవస్థ పూర్తి స్థాయిలో లేకపోవడం, సరిపడా కుళాయిలు లేకపోవడం ప్రజలను వేధిస్తోంది. ఇంటింటికీ కుళాయి ఇస్తామని చెప్పుకొన్న వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో దానిని నెరవేర్చలేకపోయింది. 2019కి ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం మల్లేశ్వరం సమగ్ర రక్షిత నీటి పథకాన్ని విస్తరించి బంటుమిల్లితో పాటు పలు గ్రామాలకు ఇంటింటికీ కుళాయి ఇచ్చే ఉద్దేశంతో సుమారు 10 ఎకరాల భూమి సేకరించి చెరువు తవ్వారు. ప్రధాన చెరువుకు అనుసంధానం చేసే సమయానికి వైకాపా అధికారంలోకి వచ్చింది. తరువాత దానిని ఆచరణలోకి తీసుకురాలేదు దీనితో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు కాలేదు.

మండల కేంద్రం బంటుమిల్లి కావడంతో గ్రామీణ ప్రాంతాల వారు కూడా ఉపాధి అవకాశాలు, పిల్లల చదువులు ఇతరత్రా కారణాలతో బంటుమిల్లి వచ్చి స్థిరపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న రక్షిత నీటి పథకం వేసవిలో పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేయలేకపోతోంది. భవిష్యత్తు అవసరాల రీత్యా పథకాన్ని విస్తరించడం లేదా గతంలో చివరి దశలో ఆగిపోయిన మల్లేశ్వరం సమగ్ర రక్షిత నీటి పథకానికి అనుసంధానం చేయాలి. చెరువును వాడుకలోకి తీసుకురావడం వల్ల స్వచ్ఛమైన తాగు నీరు అందడంతో పాటు భవిష్యత్తులో సమస్యలు ఉండవని ప్రజలు కోరుకొంటున్నారు.

బంటుమిల్లి పంచాయతీ పరిధిలో నివాసాలు	: 2182
కుళాయిలు ఉన్నది	: 800 మాత్రమే



మసీదు ఎదురు వీధిలో రోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు

సీసీ కాలువలు లేవు...

బంటుమిల్లిలో మచిలీపట్నం, గుడివాడ వెళ్లే ప్రధాన రోడ్లు వెంబడి తప్పితే చాలాచోట్ల శాశ్వత సీసీ కాలువలు లేవు. ప్రధానంగా బీఎన్ ఆర్‌కాలనీ, ముడవదిబ్బ, బీసీకాలనీ, గణేష్ కాలనీ, ప్రభుత్వ మండల కార్యాలయాలు ఉండే రోడ్డు, తదితర ప్రాంతాలలో డ్రైనేజీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవి కూడా పలు చోట్ల పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో రూ.7కోట్లతో ఆర్భాటంగా సీసీ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించింది. అది ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రారంభమై ఆదిలోనే ఆగిపోయింది.



అసంపూర్తిగా సీసీ కాలువల నిర్మాణం

◆ అధికారులు, ప్రజాప్రతినిధులను వివరణ కోరగా మల్లేశ్వరం సమగ్ర రక్షిత నీటి పథకానికి అనుసంధానంగా తవ్విన చెరువును వాడుకలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ఉపాధిహామీ నిధుల ద్వారా సీసీ డ్రైనేజీ నిర్మించనున్నట్లు తెలిపారు.

సినిమాలు

రేవతి: వేట్టయన్, **సిరివెంకట్:** దేవర **సిరికృష్ణ:** విశ్వం, **రామరాజు:** జనక అయితే గనక –మచిలీపట్నం, కార్పొరేషన్

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం



మత్తు పదార్థాలపై అవగాహన

ఉంగుటూరు మండలం ఆత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల దుర్వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్, స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేడు విద్యార్థులు, యువత తమ జీవితాలను మత్తు పదార్థాలకు బానిసై చిన్నాభిన్నం చేసుకుంటున్నారంటూ పలు అంశాలపై ఎస్సై సురేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

తొలగిన చీకట్లు

కానూరు, న్యూస్‌టుడే: చెక్‌పోస్టు సెంటర్ నుంచి కామయ్యతోపు సెంటర్ వరకు గత 4 నెలలుగా వీధిదీపాలు వెలగకపోవడంపై 'ఈనాడు'లో వరస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించారు. అక్కడ మరమ్మతులు నిర్వహించి వీధి దీపాలు వెలిగేలా చేయడంతో బందరురోడ్డులో అంధకారం తొలగింది.



పప్పులమిల్లు సెంటర్‌లో వెలుగులు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

పోరంకి, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి గీతాబాయి అన్నారు. కానూరు మురళీనగర్‌లోని ఓ స్కానింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం పరిధిలో నమోదు చేయాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్య విద్య బోధకుడు బి. రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులు వెళ్లడంతో డీఎంహెచ్‌వో గీతాబాయి క్షేత్ర పరిశీలన చేశారు. చిన్నపిల్లలకు వైద్య సేవలందించే ఓ క్లినిక్ మాత్రం ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని గుర్తించారు. తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, లేకుంటే మూసివేయాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. అనంతరం బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యాధికారిణి మంజూష, ఎంపీహెచ్‌వో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అలా ఆదేశం.. ఇలా అమలు

కంకిపాడు, న్యూస్‌టుడే

కంకిపాడులో సోమవారం జరిగిన 'పల్లె పండగ'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలను సంబంధిత అధికారులు అమల్లో పెట్టారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపు, గుర్తించిన, చేపట్టిన, పూర్తయిన పనులతో కూడిన సమాచార బోర్డులను ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని మౌఖికంగా ఆదేశించడం విదితమే. ఈ మేరకు ఆయా పనులకు చెందిన చిత్రాలతో పాటు గణాంకాలను నమోదు చేస్తున్నారు. మహాత్మాగాంధీ, స్వచ్ఛ భారత్, 'నరేగా'ల లోగోలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రాలతో బోర్డు ఆకర్షణీయంగా కనపడుతోంది. దీనిలో నమోదు చేసిన సమాచారం స్పష్టంగా సులభంగా అర్థమయ్యేలా ఉంది. సీసీ, బీటీ రహదారులు, కాల్వకట్టల సుందరీకరణ, పంట, ఇంకుడు గుంతలు, పంట కాలువల బాగుచేత పనులు, గోకులాల, సామాజిక మొక్కల పెంపకం..తదితర అంశాలను పొందుపరచారు. వైకాపా ప్రభుత్వం హయాంలో వలె కాకుండా అన్ని రంగులనూ దీనిలో ఉపయోగించడం ప్రత్యేకత.



గ్రామ పంచాయతీ ప్రహరీపై 'పల్లె పండగ' సమాచారం

వెలగకుండానే.. పాడుబెట్టేస్తున్నారు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

హనుమాన్‌జంక్షన్ పరిధిలో పాత 16వ జాతీయ రహదారిని ఆర్‌అండ్‌బీకి బదలాయించే క్రమంలో 8 నెలల కిందట ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాలుగు రహదారుల వెంబడి దాదాపు 160 వరకు స్తంభాలు అమర్చారు. 5 నెలలు దాటినా ఇప్పటి వరకు వైరింగ్ కూడా చేయలేదు. స్తంభాలు, దీపాలు ఎక్కడికక్కడ పాడైపోతున్నాయి. నూజివీడు రోడ్డులో ఓ స్తంభం పూర్తిగా విరిగిపోవడం, పలు దీపాలు ధ్వంసమైపోవడం వంటివి చోటు చేసుకున్నాయి. అయినా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఏకంగా స్తంభం కూడా తీసేశారు



ఓ వైపు మాత్రమే ఉన్న దీపం

తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

పోరంకి, న్యూస్‌టుడే : సమష్టిగా పని చేస్తూ తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం పోరంకి ద్వారకా రెసిడెన్సీ ఫంక్షన్ హాల్లో స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలసి పురపాలిక అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణకు 328 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా పనులు సజావుగా సాగేందుకు అదనంగా మరో 75 మంది సిబ్బందిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ దస్త్రం సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

❖ ప్రస్తుత కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. హౌస్ హోల్డ్ అసెస్మెంట్ రూపొందించడానికి సచివాలయ ఉద్యోగులను కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదన్నారు. తక్షణమే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

❖ కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, నీటి, ఆస్తి పన్నులను మదింపు చేయడానికి సచివాలయ సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. పౌరులు సకాలంలో పన్నులు చెల్లించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. బందరు రోడ్డు ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీ సక్రమంగా నిర్మించాలని, అందుకు అవసరమైన అంచనాలను రూపొందించి సమర్పించాలని జాతీయ రహదారుల అధికారులకు ఫోన్‌లో సూచించారు. అనధికార లేఔట్లపై దృష్టి సారించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఏర్పాటు చేస్తే అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన స్థానిక శాసనసభ్యుడితో కలిసి తులసీనగర్, కానూరు వృద్ధుల ఆశ్రమం రోడ్డులోని డ్రెయినేజీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని బోడేతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ అధికారి బీఎస్ హేలా షారోన్, తాడిగడప పురపాలక కమిషనర్ పి. భవానీ ప్రసాద్, తహసీల్దార్ గోపాలకృష్ణ , మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్, పక్కన కలెక్టర్ డీకే బాలాజీ

మార్కెట్‌లో టమాటాల కొరత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రైతుబజార్లలో టమాటా కొరత నెలకొంది. మొన్నటి వరకు ధర అధికంగా ఉండడంతో స్టాళ్ల నిర్వాహకులు సరకు పెట్టడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. బహిరంగ మార్కెట్లో కిలో ధర రూ.100కు చేరి వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. దీంతో ప్రభుత్వం రైతుబజార్లలో కొన్ని రోజులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రాయితీపై టమాటా విక్రయాలు జరిపారు. కొన్ని రోజుల్నుంచి ధర తగ్గి కిలో రూ.50కు అటు, ఇటుగా ఉండడంతో ఈ కౌంటర్లు దాదాపుగా తీసివేశారు. మరో వైపు ధర తగ్గినా దసరా తర్వాత నుంచి మార్కెట్లో తగినంతగా టమాటా నిల్వలు అందుబాటులో లేకపోవడం, ఉన్నా రైతుబజారులో నిర్ణయించే ధర గిట్టుబాటు కావట్లేదనే కారణంతో కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 రైతుబజార్లలోనూ నామమాత్రంగానే టమాటా విక్రయాలు జరుపుతున్నారు. పైగా సరకు కూడా నాసిరకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



గన్నవరం రైతుబజారులో నాసిరకం టమాటాలు

పురపాలిక వ్యాన్ డ్రైవర్ల వినూత్న నిరసన

కానూరు, న్యూస్‌టుడే : తాడిగడప పురపాలక సంఘంలో చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు జీతాలు, బకాయిలు చెల్లించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని సీఐటీయూ నాయకులు మస్తాన్‌వలి హెచ్చరించారు. కానూరులో గురువారం డ్రైవర్లు భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. 3 నెలలుగా తమ జీతాలు ఇవ్వడంలేదని పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు చెల్లించలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. 4 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని డ్రైవర్లు కోరారు. పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



కానూరులో మున్సిపల్ వ్యాన్ డ్రైవర్ల భిక్షాటన

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో ప్రగతి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఉంగుటూరు మండలంలోని మానికొండ, తరిగొప్పుల, వేంపాడు, నందమూరు, వేమండ, ఇందుపల్లి, కొయ్యగూరపాడు, పొణుకుమాడులో రూ.2.01కోట్లతో నిర్మించే సీసీ, బీటీ రోడ్లకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు స్థానిక సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనిరాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యకుమార్, తెదేపా నాయకులు, తెలుగు మహిళలు, యువత పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెనమలూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. పెదపులిపాక, చోడవరం గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ. 5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరంలో రూ.3 కోట్లు, పెదపులిపాకలో రూ.2 కోట్లతో రహదారులు, డ్రెయిన్లు, సీసీ రహదారులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్పంచులు కాకర్ల వెంకటరత్నం, గుంటూరు శ్రీనివాస్ చౌదరి, ఎంపీడీవో బండి ప్రణవి, తహసీల్దారు గోపాలకృష్ణ, తెదేపా నేతలు ముసునూరి శ్రీనివాస్, ముసునూరి శ్రీధర్, బర్మా సుబ్రహ్మణ్యం, కలపాల శ్రీధర్, చాగర్లమూడి బాలకోటేశ్వరరావు, గవిర్నేని బదరీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు గ్రామీణ, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తెదేపా ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. మండలంలోని కాసరనేనివారిపాలెంలో గురువారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రహదారుల శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. రూ.40లక్షల నిధులు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ ఎన్. రాజ్యలక్ష్మి, సర్పంచి పి.వరప్రసాద్, జనసేన సమన్వయకర్త రాజా, నాయకులు ప్రభాకరరావు, ఆనంద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

? కానూరు మాణిక్యనగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీసం మరమ్మతులు చేయించి సమస్యపరిష్కరించాలి. - మధు, కానూరు.

✔ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను.
- భవానీ ప్రసాదు, పురపాలకసంఘం కమిషనర్

? కానూరు వినాయకనగర్‌లో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. పురపాలిక అధికారులు చర్యలు చేపట్టాలి. - మంజుల, కానూరు

✔ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను. - భవానీ ప్రసాదు, పురపాలకసంఘం కమిషనర్ – న్యూస్‌టుడే, కానూరు

ట్యాంకు పూర్తయ్యేదెన్నడో..
రక్షిత జలాలు అందేదెప్పుడో?

పెనమలూరు, న్యూస్‌టుడే

నాలుగు వేల మందికి తాగునీటిని అందించాల్సిన ట్యాంకు నిర్మాణం నిలిచిపోయింది. గత జనవరిలో ప్రజలకు రక్షిత జలాలు అందించాల్సి ఉన్నా.. ఇప్పటికీ పిల్లర్ల దశ దాటలేదు. అది ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పెదపులిపాక శ్రీనగర్ కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన తాగునీటి ట్యాంకు నిర్మాణ దుస్థితి ఇది.

నాలుగు కాలనీలకు తాగునీటి సౌకర్యం

ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారుల నిర్లక్ష్యం పెదపులిపాక శ్రీనగర్ కాలనీ తాగునీటి ట్యాంకు నిర్మాణాన్ని నిండా ముంచింది. గతేడాది ఆగస్టులో ట్యాంకు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేశారు. జనవరి నాటికి పనులు పూర్తి చేసి తాగునీటిని అందించాలనుకున్నారు. అయితే నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. శ్రీనగర్ కాలనీ, గణపతి నగర్, ఎమ్వీఆర్ నగర్, ఎన్టీఆర్ నగర్‌లతో పాటు పరిసర ప్రాంతాల్లోని దాదాపు నాలుగు వేల మందికి దీని ద్వారా రక్షిత జలాలు సరఫరా చేయాల్సి ఉంది. స్థానికులు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. దీంతో కొన్ని చోట్ల బోర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. రామలింగేశ్వరనగర్‌లోని మురుగు నీటి శుద్ధజల ప్లాంటు నుంచి సరిగా శుద్ధి చేయకుండా విడుదల చేస్తున్న మురుగు, వ్యర్థ జలాల కారణంగా ఈ బోర్లలో కలుషిత నీరు వస్తోంది. స్థానికులు వ్యయప్రయాసల కోర్చి శుద్ధజల ప్లాంట్ల నుంచి తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు.



పిల్లర్ల దశలోనే నిలిచిన పెదపులిపాక తాగునీటి ట్యాంకు

నిధుల కొరతే కారణం..

ట్యాంకు నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించారు. ఇందులో జడ్పీ నుంచి రూ.10 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలు ఉన్నాయి. ట్యాంకు నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. మండల పరిషత్, జడ్పీ నుంచి నిధులు మంజూరు చేయించడంలో ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారులు అలసత్వం వహించారు. ఫలితంగా నిర్మాణానికి నిధుల కొరత ఎదురైంది. దీనిపై సర్పంచితో పాటు స్థానికులు మండల పరిషత్ అధికారులకు పదులసార్లు మొరపెట్టుకొన్నా ఫలితం లేకపోయింది. దీనిపై కొద్ది రోజుల కిందట స్థానికులు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

20 సార్లు మొరపెట్టుకొన్నాం
– బర్మా సుబ్రహ్మణ్యం, స్థానికుడు

శ్రీనగర్ కాలనీలో నిలిచిపోయిన ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేయాలని గత జనవరి నుంచి ఇప్పటి వరకూ 20 సార్లు మండల పరిషత్ అధికారులకు మొరపెట్టుకున్నాం. అయినా చర్యలు లేవు. నిధులు విడుదల చేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మా ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉంటారు. వ్యయప్రయాసల కోర్చి దూర ప్రాంతంలోని శుద్ధ జల ప్లాంట్ల నుంచి కొనుగోలు చేసి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు వెంటనే స్పందించాలి.



పిడుగులతో బెంబేలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : హనుమాన్ జంక్షన్, పరిసర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం 10 గంటల సమయంలో ఓ సారి, సాయంత్రం 4 గంటల సమయంలో మరోసారి వరుణుడు విరుచుకుపడటంతో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. ఈ సమయంలో పలుచోట్ల పిడుగులు పడటంతో జనం ఆందోళనకు గురయ్యారు. వేలేరు అడ్డరోడ్డులోని మారుతీ గ్యాస్ కంపెనీ సమీపంలో విద్యుత్తు తీగలపై పిడుగు పడడంతో తీగలు తెగిపోయాయి. గంటల తరబడి సరఫరా నిలిచిపోవడంతో పాటు గ్యాస్ కంపెనీలో కంప్యూటర్లు, సమీప నివాసాల్లో ఫ్యాన్లు, లైట్లు పాడైపోయాయి.

ఆలపాటిని గెలిపించేందుకు కృషి

కంకిపాడు గ్రామీణం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ఆలపాటి రాజా విజయానికి ప్రతి తెదేపా కార్యకర్త కృషిచేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావూరి చంద్రమోహన్ అన్నారు. స్థానిక మండల తెదేపా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఏడుకొండలు, మండల అధ్యక్షుడు రవీంద్ర, మాజీ ఎంపీపీ రాజా, వైస్ ఎంపీపీ డి.కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా గన్నవరం సెక్షన్ పరిధిలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, జక్కులనెక్కలరం పంచాయతీ పరిధిలో ఉదయం 8 నుంచి 11గంటల మధ్య సరఫరా నిలివేయనున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా గ్యార్మీ పండగ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు తారక రామానగర్ జెండా చెట్టు కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గ్యార్మీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల తర్వాత ముస్లిం సంప్రదాయం ప్రకారం గుర్రంపై ఉరుసు, గంధాన్ని ఊరేగించారు. అనంతరం ఆ జెండాను చెట్టుకు కట్టి ప్రార్థనలు చేశారు. విందు ఏర్పాటు చేశారు. షేక్ ఖాజా, షేక్ బాషా, అబ్దుల్లా, ఆరిఫ్, ఖాజా, అమీర్, మీరావలి, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఉరుసు ఉత్సవంలో ముస్లిం సోదరులు

రోడ్డు ప్రమాదంలో చోదకుడికి గాయాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : పెదన-విస్సన్నపేట జాతీయ రహదారిపై ఆరుగొలను వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. హనుమాన్‌జంక్షన్ పోలీసుల వివరాల ప్రకారం.. హనుమాన్‌జంక్షన్ నుంచి గుడివాడ వైపు వెళ్తున్న పాల ట్యాంకరు, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఘటనలో పాల ట్యాంకరు నడుపుతున్న వినయ్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాలకు ముందు భాగం ధ్వంసమైంది. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

పెయింటర్ అదృశ్యంపై కేసు

వణుకూరు (పెనమలూరు), న్యూస్‌టుడే : వణుకూరుకు చెందిన కనగాల బాబూజీ పెయింటింగ్ పనులు చేస్తారు. భార్యతో వివాదాలు ఏర్పడడంతో కొద్దినెలల కిందట పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 15న వారి మధ్య మరోమారు వివాదం ఏర్పడింది. అదే రోజు రాత్రి బాబూజీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి నాగమణి పెనమలూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



కంకిపాడు : వాల్మీకి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



గన్నవరంలో..

ఘనంగా వాల్మీకి జయంతి

కంకిపాడు, హనుమాన్‌జంక్షన్, ఉయ్యూరు గ్రామీణం: మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బాపులపాడు సాయిబాబా మందిరం వద్ద వాల్మీకి జయంతి నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర చేశారు. జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్, సమరసత ఫౌండేషన్ సభ్యులు యడవల్లి పాండురంగారావు, దావులూరి శ్రీహరి, సోమరాజు, వడ్డిల్లి లక్ష్మీ, వీరమాచనేని శమంతకమణి, తదితరులు పాల్గొన్నారు.

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే : పు… రాణ ఇతిహాసం అయిన రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహమ్మద్‌బేగ్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. గురువారం తాడిగడపలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం, ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయాల్లో మహర్షి వాల్మీకి జయంతి గురువారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీవోలు టి.స్వర్ణలత, సత్యకుమార్‌లు అధికారులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉయ్యూరు: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు, సిబ్బంది

జనావాసాల మధ్య బాణసంచా దుకాణాలు వద్దు

కానూరు, న్యూస్‌టుడే : దీపావళి నేపథ్యంలో టపాకాయలు అమ్మే వ్యాపారులు తాడిగడప పురపాలికలోని సర్కిల్స్ పరిధిలో జనవాసాల నడుమ, రద్దీగా ఉండే ప్రాంతాల్లో, జాతీయ రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేయవద్దని కమిషనర్ పి.భవానీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలా ఏర్పాటు చేసిన వారికి ఎటువంటి అనుమతులు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పార్కింగ్‌కు అనుమతి ఉన్న ప్రదేశాలలోనే దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రొద్దుటూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రతిభ చాటిన కె.మైనశ్రీ, పి.వాగ్దేవిలను సత్కరించారు. గోసాల పరిధిలోని హెచ్ఎంకే పాఠశాలకు చెందిన విద్యార్థిని వై.నిరుపమ వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుమిత్‌కౌర్ తెలిపారు. ఆమెను పాఠశాల కరస్పాండెంట్ వసంత్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. శిక్షకుడు కోమటిగుంట రాజును సత్కరించారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి, పక్కన వ్యాయామోపాధ్యాయుడు రమేష్

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

గుడివాడ అభివృద్ధికి దండిగా నిధులిస్తాం



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని దండిగా నిధులిచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. గురువారం ఆయన స్థానిక ప్రజావేదికలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి సత్యప్రసాద్ ఎమ్మెల్యే రాము గుడివాడ ఆర్డీవో, తాహసీల్దారు తదితర ప్రభుత్వ కార్యాలయాలను, ప్రభుత్వ అతిథి గృహాలను చూపించి వాటి స్థితిగతులు వివరించారు. తొలి విడత నిధులు రాగానే వీటి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్యే రాము.. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసి గుడివాడ పరిస్థితులు వివరించారు.. ఆయన కూడా గుడివాడలో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిధులు ఇస్తానని, స్థలం చూసుకోవాలని సూచించారు. మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ గుడివాడ అంటే అన్న ఎన్టీఆర్ గుర్తుకు వస్తారని అందుకే ఎమ్మెల్యే రాము అడుగగ్గానే నిధులు ఇవ్వడానికి ముందుకు వస్తున్నామన్నారు. ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా కూటమి నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు కొనసాగించాలి

పామర్రు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం తెచ్చిన 1214 మెమో రద్దు చేసి సంక్షేమ బోర్డు కొనసాగించాలని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కోశాధికారి వేము పెదబాబు అన్నారు. గురువారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులు, నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, మంజూరు చేసిన క్లెయిమ్‌లు వెంటనే డబ్బులు చెల్లించాలని, ఉచిత ఇసుక విధానంలో దళారుల జోక్యాన్ని అరికట్టాలని, గత వైకాపా ప్రభుత్వం తరలించిన బోర్డు నిధులు రూ.1281 కోట్లు వెంటనే బోర్డుకు జమచేయాలని కోరారు. పమిడిముక్కల మండల అధ్యక్షుడు జవహరుద్దీన్‌ఖాన్, మండల సహాయ కార్యదర్శి ఇంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు..



మంత్రి నారా లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితులు

ఉండవల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే: తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 5.48 ఎకరాల అసైన్డ్ భూమిని వైకాపా నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గుంటూరు జిల్లా ఓబులనాయుడు పాలెంకి చెందిన సిద్దెల కిరణ్ మండలంలోని ఉండవల్లిలో గురువారం జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌కి వినతిపత్రం అందజేశారు. రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న టీపీ, డీఈవో, హెల్పర్లకు కాంట్రాక్టు కాల పరిమితి 11 నెలలకు రెన్యూవల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సిబ్బంది మంత్రికి విజ్ఞప్తి చేశారు. గత నెలలో వచ్చిన వరదల్లో తన ట్యాక్సీ మునిగి పూర్తిగా పాడైందని మరమ్మతులకు తన వద్ద నగదు లేదని ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం హనుమంతపురానికి చెందిన కొడాలి కరుణాకర్ బాబు కోరారు. తన భర్తకు బీమా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నానని వివరించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా మందడం గ్రామానికి చెందిన పిల్లపాగ రోశమ్మ విన్నవించారు. డిగ్రీ వరకు చదివిన తన దివ్యాంగ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని గుంటూరు శ్రీనగర్‌కు చెందిన బొంతల శ్రీనివాసరావు మంత్రి నారా లోకేశ్‌కి వినతిపత్రం అందజేశారు.

అడిగేదెవరు? ఆపేదెవరు?

తోట్లవల్లూరు కేంద్రంగా ఇసుక అక్రమ తవ్వకాలు

ఉచితం పేరుతో రేయింబవళ్లూ ఎడ్లబండ్లతో రవాణా

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

కృష్ణా నది పాయలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మండలంలోని రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్ళంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు గ్రామాల్లో ఇసుక క్వారీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిలో వరద తగ్గి ఇసుక మేటలు బయట పడ్డాయి. మండలంలోని పలు గ్రామాలతో పాటు ఉయ్యూరు, కంకిపాడు ఇంకా తదితర బయట గ్రామాల నుంచి ఎడ్లబళ్లతో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తరలిపోతోంది. ఇందుకు ఎలాంటి అనుమతులు లేకపోయినా ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగిపోతున్నా అధికారులు కిమ్మనడం లేదు.

నిబంధనలకు తూట్లు

నిబంధనల ప్రకారం.. క్వారీ నుంచి 5 కి.మీ.లోపు వారు మాత్రమే ఎడ్లబండ్లతో ఇసుక తీసుకెళ్లవచ్చు. అది కూడా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే. తోట్లవల్లూరు గ్రామస్థులే కాకుండా ఇతర గ్రామాల నుంచి కూడా ఎడ్లబండ్ల తరలివచ్చి లోడింగ్ చేసుకుని ఉయ్యూరు తరలిస్తున్నారు. ఒక్కో బండి రూ.1800 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కొంతమంది అయితే రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి ట్రాక్టర్లు, లారీలతో బయటకు తరలిస్తున్నారు. ఇసుక నిర్మాణదారులకు ఒక్కో ఎడ్లబండి రూ.1800కు అమ్ముతున్నారు. ఇదంతా కళ్లెదుటే జరుగుతున్నా రెవెన్యూ, సచివాలయ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

అడ్డగోలు తవ్వకాలతో పలువురు మృత్యువాత

నది ఒడ్డునే తవ్వకాలు చేయడం వల్ల వరదలు వచ్చినప్పుడు గుండాలు ఏర్పడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. గతంలో ఇలాంటి తవ్వకాలు వల్లే తోట్లవల్లూరు ఘాట్ సమీపంలో ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. రెవెన్యూ అధికారులు కూడా ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి, బ్యానర్లు కట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఒకరిని చూసి ఒకరు ఆ ప్రాంతంలోనే ఇసుక తవ్వకాలు జరపడం వల్ల పెద్ద అగాథాలు ఏర్పడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



కృష్ణా నది పాయలో ఎడ్లబండ్ల కోలాహలం



ఇసుక లోడింగ్ చేసుకుని వెళుతూ..

ఇళ్ల కట్టుకునే వారికే అనుమతులు

ఇళ్ల కట్టుకునేవారికి మాత్రమే అనుమతులు ఇచ్చాం. వీటి పేరు చెప్పి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఇసుక నిల్వలు పెట్టినా చర్యలు చేపడతాం. నది ఒడ్డున త్వకాలు జరిపితే పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. రాత్రి సమయాల్లో బండ్ల ద్వారా ఇసుక తీసుకెళ్లకుండా వీఆర్వోలను కాపాలా పెట్టాం. ఎడ్లబండ్ల యాజమానులకు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. గతంలో ఉన్న జీవోలన్నీ రద్దు అయ్యాయి. ఇసుక అక్రమ రవాణా చేస్తూ ఎడ్లబండి పట్టుబడితే రూ.2 వేలు జరిమానా విధిస్తాం. **- ఎం.కుసుమకుమారి, తహసీల్దార్**

శ్రీకొండలమ్మ ఆలయంలో చండీహోమం

వేమవరం(గుడ్లవల్లేరు): మండలంలోని వేమవరం శ్రీకొండలమ్మ ఆలయంలో గురువారం ఆశ్వీయుజ పౌర్ణమి పురస్కరించుకుని చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర అమ్మవారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు.

గంగానమ్మ తల్లి వార్షిక జాతర

పెదపారుపూడి: మండలంలోని మోపర్రులో కొలువైన శ్రీగంగానమ్మతల్లి వార్షిక జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన చేశారు.

భక్తితో గ్యార్మీ పండగ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ముస్లిం సోదరులు మహబూబ్ సుభానీ గ్యార్మీ పండగను గురువారం భక్తితో నిర్వహించారు. ముస్లిం సోదరులు జెండా కర్రలను పట్టుకుని ఊరేగించారు. మత పెద్దలు రఫీఉల్లా, షఫీ ఉల్లా, అబూబకర్, సమీవుల్లా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామాలకు మహర్దశ



వెంట్రప్రగడ: భూమిపూజలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పెదపూడిలో..





ఈపూరువానిగూడెంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు, మల్లాయిచిట్టూరులో..



అయ్యంకిలో..

గోపువానిపాలెం(పమిడిముక్కల), న్యూస్‌టుడే: గత వైకాపా అయిదేళ్ల పాలనలో అందరూ అడుగడుగునా ఎన్నో సమస్యలతో సతమతమయ్యామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో వాటికి చరమగీతం పాడేందుకు సమష్టిగా ముందుకు రావాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా పిలుపునిచ్చారు. పల్లె పండగలో భాగంగా గురువారం గోపువానిపాలెంలో రోడ్లకు భూమిపూజ చేశారు. **పెదపారుపూడి :** మండలంలోని వానపాముల, కొర్నిపాడు, వెంట్రప్రగడ, మోపర్రు గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శంకుస్థాపన చేశారు.

పెదప్రోలు(మోపిదేవి), న్యూస్‌టుడే: మండలంలో మేజర్ పంచాయతీలైన పెదప్రోలు, మోపిదేవిలలో రూ.1.54కోట్ల వ్యయంతో 24 సిమెంటు రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ భూమిపూజ చేశారు. మండలి వెంకట్రామ్, ఎంపీపీ దుర్గావాణి, పాల్గొన్నారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ మండలంలో నాలుగు గ్రామాల్లో 16 సీసీ రహదారుల నిర్మాణానికి రూ.96 లక్షలు మంజూరు కాగా పనులకు శంకుస్థాపన నిర్వహించారు. యద్దనపూడిలో రూ.10 లక్షలతో రెండు రోడ్లకు సర్పంచి బాలకృష్ణ శంకుస్థాపన చేయగా.. పంచాయతీ కార్యదర్శి కళావతి, పీఆర్ ఏఈ వాసుదేవరావులు పాల్గొన్నారు. పెదపూడిలో రూ.10లక్షలతో రెండు రహదారులకు భూమిపూజ చేశారు. అయ్యంకి, చినముత్తేవిలో శంకుస్థాపనలు నిర్వహించారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: చిట్టూర్పు ఈపూరువానిగూడెంలో రూ.14 లక్షలు నిధులతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ భూమిపూజ చేశారు. మల్లాయి చిట్టూరులో సీసీ రోడ్లకు పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి వెంకట్రామ్ భూమి పూజ చేశారు. పూషడం, యండకుదురు, గోగినేనిపాలెంలో అభివృద్ధి పనులకు ఆయా ప్రాంతాల నాయకులు శంకుస్థాపనలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక వైపు ఉన్న రహదారి గోతులు పడి పాడయ్యింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - కె.నాగరాజు, పామర్రు

✔ పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి రహదారి నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. **- సలీమ్, పంచాయతీ కార్యదర్శి**

? స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. **- కె.రమేష్, పామర్రు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త తొలగించి సంపద కేంద్రానికి తరలిస్తాం. **- శానిటరీ ఇన్‌స్పెక్టర్, పామర్రు**

– న్యూస్‌టుడే, పామర్రు

? మండల పరిధిలోని 10వ నెంబరు పంటకాల్వలో పిచ్చికాడ, రబ్బరుకాడ దట్టంగా అల్లుకుపోయింది. దాదాపు కిలోమీటరుపైగా విస్తరించి నీటి ప్రవాహాన్ని నియంత్రిస్తోంది. **- రైతులు, పెదప్రోలు**

✔ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. తగ్గిన తర్వాత ముందు పిచికారి చేయిస్తాము. **- రవితేజ, ఏఈ, జలవనరులశాఖ, మోపిదేవి**

– న్యూస్‌టుడే, మోపిదేవి

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: డిసెంబరు 14న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్ కక్షిదారులకు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని, దీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలహరణం చేసుకోవడం కంటే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకోవడం ఉత్తమమని చెప్పారు. అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధి నక్కవానిదారి గ్రామానికి చెందిన పచ్చ వీరబాబు గృహం అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్టు ద్వారా రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని బాధితుడికి గురువారం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు విక్కుర్తి రాంబాబు, మాజీ ఎంపీపీ పెద్ది భాస్కర్‌రావు, బడే వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

మనకోసం మనం ట్రస్టుకు విరాళం

చల్లపల్లి, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, చల్లపల్లి మాజీ సర్పంచి వరదా రామారావు 4వ వర్ధంతిని పురస్కరించుకుని అతని కుమారుడు, చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ హరిగోపాల్ స్వచ్ఛచల్లపల్లి అభివృద్ధికి రూ.10వేలు విరాళాన్ని అందజేశారు. తమ స్వగ్రామం చల్లపల్లి సర్వతోముఖాభివృద్ధికి వీరి కుటుంబం ఇప్పటివరకు రూ.1.15 లక్షలు అందించినట్లు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ చెప్పారు.

గణితశాస్త్ర పుస్తకాల పంపిణీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న 25 మంది మెరిట్ విద్యార్థులకు రూ.5 వేలు విలువైన వేదిక్ గణితశాస్త్ర పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీఎన్‌బీ గోపాల్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువులే..



మల్లాయపాలెం బైపాస్ రోడ్డు వద్ద వర్షపు నీరు



వలివర్తిపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద..



అవనిగడ్డ రెండో వార్డు డీఎస్పీ కార్యాలయం రోడ్డులో..

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ మండలంలో గురువారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు చొచ్చుకెళ్లింది. రహదారులు జలమయమయ్యాయి. మల్లాయపాలెం పరిధి బాలకృష్ణా నగర్‌లో బైపాస్ రోడ్డు నుంచి గుడివాడ వెళ్లే వరకు భారీగా నీరు నిలిచింది. బాలకృష్ణా నగర్, వలివర్తిపాడు, మెరకగూడెం గ్రామాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుడివాడ మండలం వలివర్తిపాడు అరుంధతీపేటలోని అంగన్‌వాడీ కేంద్రం ముందు మురుగు నీరు నిలిచింది.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ కేంద్రం అవనిగడ్డలో రహదారులపై గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. స్టేట్ బ్యాంకు ముందు పెద్ద గొయ్యి, డీఎస్పీ కార్యాలయం ఎదుట గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం, సీతాయిలంక ఆర్‌సీఎం చర్చి ఎదుట రోడ్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వర్షాలతో చిత్తడిగా మారాయి.



కోడూరు శివారు దింటిమెరక వద్ద చెరువును తలపిస్తున్న వరి పొలాలు

ముంచెత్తిన వర్షం.. పంటలకు నష్టం



కోడూరు 15వ నెంబరు కాల్వ పరిధిలో నీటమునిగి ఇలా..

కోడూరు,(అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు మండలంలోని 15, 16, 17, 18 నెంబరు పంట కాలువల పరిధిలో వరి పొలాలు, నారుమడులు నీట మునిగి రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ దెబ్బతినడంతో సముద్రపు పోటుకు ఉప్పునీరు మురుగు కాల్వల ద్వారా వరిపొలాల్లోకి ప్రవేశిస్తోంది.



పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద నీటిని ఇంజిన్‌తో బయటకు తరలింపు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక టీఎస్ఆర్ అండ్ ఈఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతి శేషుకుమార్ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు విద్యార్థులు వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ(కూచిపూడి): వాల్మీకి జయంతి వేడుకలు మొవ్వ తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి తహసీల్దారు మస్తాన్, ఆర్ఐ విజయదుర్గ, మండల సర్వేయర్ కిశోర్, వీఆర్వోలు, వీఆర్ఏలు నివాళులర్పించారు.



మొవ్వ: కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, సిబ్బంది



శ్రీకాకుళం గ్రంథాలయంలో..

అవనిగడ్డ, ఘంటసాల: స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్సీ విద్యార్థులు, పాఠకులు, లైబ్రేరియన్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ☛ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శ్రీకాకుళం గ్రంథాలయంలో, తెలుగురావుపాలెం సచివాలయంలో, యండకుదరు సచివాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సుజాత, సర్పంచులు ప్రసాద్ బాబు, పట్టాభిరామారావు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు



నిరసన తెలుపుతున్న మహిళలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి సమస్యలు సృష్టించవద్దని స్థానిక బేతవోలు మహిళలు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని విజయవాడ రహదారిలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని, ఇళ్ల మధ్యలో ఉంటే తరచూ గొడవలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు కాసేపు రోడ్డుపై ధర్నా చేశారు. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి అధికారులతో మాట్లాడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం భావ్యం కాదని చెప్పి మహిళలను పంపేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పామర్రు రూరల్, న్యూస్‌టుడే: పామర్రు మండలం బల్లిపర్రు సెంటరులో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన వాహన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం. . మచిలీపట్నం రూరల్ ముంజులూరుకు చెందిన వేణు, పశ్చిమ గోదావరి జిల్లా ఆకువీడుకు చెందిన నాగపూర్ణిమలు స్కూటీపై మచిలీపట్నం వైపు నుంచి విజయవాడ వెళ్తున్నారు. అదే సమయంలో కృష్ణా జిల్లా పెదమద్దాలి చెందిన వృద్ధుడు ఎం.వెంకటేశ్వరావు స్కూటీపై విజయవాడ వెళ్లేందుకు బల్లిపర్రు సెంటరు వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొనడంతో వాటిపై ఉన్న ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిలో వెంకటేశ్వరరావును 108లో, మిగిలిన ఇద్దర్నీ జాతీయ రహదారికి చెందిన అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధంకండి

పెదపారుపూడి న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా కావాలని మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని వానపాములలో ఇటీవల చనిపోయిన మాజీ సర్పంచి డేవిడ్ రాజు తల్లి పెద్దకర్మలో పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

రతన్ టాటాకు ఘన నివాళి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్థానిక ప్రధాన కూడలి, రామాలయం వద్ద గురువారం ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బండే భూషయ్య, జయలక్ష్మి కళాపీఠం అధ్యక్షుడు బండే శేషగిరిరావు మాట్లాడుతూ.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం టాటా గొప్పతనమని చెప్పారు. కార్యక్రమంలో రతన్ టాటా అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అభిమానులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న వెంకట గురుమూర్తి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తేవాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పామర్రు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులకు చెస్, యోగా పోటీలకు ఎంపికలు నిర్వహించారు. హెచ్ఎం ఫణీ రాజమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.1.70 కోట్లతో రహదారుల మరమ్మతులు

అవనిగడ్డగ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో రహదారులు, భవనాల శాఖ రూ.1.70 కోట్లతో అత్యవసర పనుల నిమిత్తం రహదారులకు మరమ్మతులు చేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ ఎం.రమేష్ గురువారం న్యూస్‌టుడేకు చెప్పారు. నాగాయలంక మండలంలోని నాలి -కమ్మనమోలు రహదారిని 12 కిమీ పొడవునా రూ.30లక్షలతో, టి.కొత్తపాలెం గుల్లలమోద రహదారిని రూ.30లక్షలు, చల్లపల్లి మండలంలోని రామానగరం-నడకుదురు రహదారి ఘంటసాల కొడాలి వరకు రూ.40 లక్షలు, కొడాలి-చల్లపల్లి రహదారి రూ.30లక్షలు, కొడాలి-శ్రీకాకుళం రహదారికి రూ.25లక్షలు, చల్లపల్లి - నడకుదురు రహదారికి రూ.15 లక్షలతో మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తైందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

తోట్లవల్లూరు: మండలంలోని యాకమూరుకు చెందిన వృద్ధుడు ఆర్మూగం సురేష్(74) కనిపించడం లేదని గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై అర్జునురాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సురేష్ అక్టోబరు 3వ తేదీన ఇంటి నుంచి సైకిల్ వేసుకుని బయలుదేరి ఉయ్యూరులో నివాసం ఉంటున్న చెల్లి ఇంటికి వెళ్లారు. అక్కడ సైకిల్ పెట్టి బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కూతురు అన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ప్రిపరేషన్ టెక్నిక్

పుస్తకంలో లేదా నోట్ బుక్‌లో చదివినప్పుడు ముఖ్యమైన అంశాలను ఇన్నర్‌లైన్ కలర్‌తో మార్క్ చేయడం లేదా అండర్‌లైన్ చేయడం ద్వారా హైలైట్ చేసుకోవాలి. దీని వల్ల ప్రధానమైన విషయాలను తేలిగ్గా గుర్తుంచుకోవచ్చు. వేగంగా రివిజన్ చేసుకోవచ్చు.

కరెంట్ అఫైర్స్



■ ఇటీవల భారత నౌకాదళంలో చేరిన అణుశక్తితో నడిచే రెండో బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్) ఏది? (రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ జలాంతర్గామిని విశాఖపట్నంలో ప్రారంభించారు. అణుశక్తితో నడిచే భారత తొలి బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్)
జ: ఐఎన్ఎస్ అరిఘాత్

మాదిరి ప్రశ్నలు

■ జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ) కింద ఎన్ని కొత్త పారిశ్రామిక స్మార్ట్ సిటీల ఏర్పాటుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. (ఈ ప్రాజెక్టుల అంచనా పెట్టుబడి మొత్తం రూ. 28,602 కోట్లు. వీటిని 10 రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నారు.) జ: 12

■ పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) కింద భారత పౌరసత్వాన్ని పొందిన మొదటి గోవా వ్యక్తిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు?
జ: జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరైరా

■ ఇరాన్ మొదటి మహిళా ప్రభుత్వ ప్రతినిధిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ప్రముఖ విద్యావేత్త అయిన ఈమె గతంలో 'టెక్నికల్ అండ్ ఒకేషనల్ ట్రైనింగ్ యూనివర్సిటీ ఆఫ్ షరియా'కి నాయకత్వం వహించారు.)
జ: ఫతేమెహ్ మొహజెరానీ

మరింత సమాచారం

తేలినా.. మునిగినా.. ఉంటుందో సూత్రం!

జనరల్ స్టడీస్ — భౌతిక శాస్త్రం





అంతపెద్ద ఓడ నీళ్లపై ఎలా తేలుతుంది? గాలితో నిండి ఇంత లావుగా మారిన బెలూన్ కూడా ఎగురుకుంటూ ఏవిధంగా వెళ్లిపోతుంది? ఒకే పరిమాణం ఉన్న చెక్క నీటిపై తేలితే, ఇనుము మునిగిపోతుంది ఎందుకని? ఎప్పుడైనా ఆలోచించారా? వీటన్నింటిలో కొన్ని భౌతికశాస్త్ర సూత్రాలు పనిచేస్తుంటాయి. పదార్థాల స్వభావాన్ని, స్థితిని వాటి సాంద్రత ప్రభావితం చేస్తుంది. తేలడం, మునగడం, ఎగరడాలను అదే నిర్ణయిస్తుంది. భౌతిక శాస్త్రంలో ప్రాథమికాంశాలైన ఈ నియమాలను అభ్యర్థులు తెలుసుకోవాలి. వాటి ఆధారంగా పనిచేసే పరికరాలు, ఉపయోగాలతోపాటు ఆర్కిమెడిస్, పాస్కల్, బెర్నౌలీ సూత్రాలు, సమీకరణాలను అర్థం చేసుకోవాలి. సంబంధిత అనువర్తనాలపై అవగాహన కలిగి ఉండాలి.

తేలియాడే వస్తువులు

కొన్ని రకాల వస్తువులు నీటిలో మునుగుతాయి, మరికొన్ని తేలుతాయి. అలాగే గాజు గోలీలు నీటిలో మునుగుతాయని, చెక్కముక్క నీటిలో తేలుతుందని అందరికీ తెలుసు.

1) రెండు కిలోగ్రాముల చెక్క ముక్క ఒక కిలోగ్రాము ఇనుము కంటే బరువైంది.

2) ఇనుము, చెక్క కంటే బరువైంది.

ఈ వాక్యాల్లో బరువు అనే పదం ఏ అర్థంలో వాడారో తెలుసుకోవాలి. విజ్ఞాన శాస్త్రంలో ఏ పదాన్ని అయినా అందరికీ ఒకే రకంగా అర్థమయ్యే విధంగా ఉపయోగిస్తారు. మొదటి వాక్యం ప్రకారం త్రాసులో ఒక పళ్లెంలో రెండు కిలోగ్రాముల చెక్కను, మరో పళ్లెంలో ఒక కిలోగ్రాము ఇనుమును ఉంచితే త్రాసు దండం చెక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది.

◆ రెండో వాక్యం ప్రకారం.. ఇనుము, చెక్క కంటే బరువైనదంటే.. ఒకే పరిమాణం ఉన్న ఇనుము, చెక్క ముక్కలను త్రాసు పళ్లాల్లో చెరొక దాన్ని ఉంచితే త్రాసు దండం ఇనుప ముక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది. విజ్ఞానశాస్త్ర పరిభాషలో చెక్క కంటే ఇనుము సాంద్రత ఎక్కువ. బరువు, తేలిక అనేవి సాంద్రత ఆధారంగా నిర్ణయమవుతాయి.

సాంద్రత: ప్రమాణ ఘనపరిమాణం ఉన్న పదార్థ ద్రవ్యరాశిని సాంద్రత అంటారు.

$$\therefore \text{సాంద్రత} = \frac{\text{ద్రవ్యరాశి}}{\text{ఘనపరిమాణం}}$$

● నీటి సాంద్రత $= 1\ gm/cm^3$

S.I. యూనిట్ $\longrightarrow kg/m^3$

CGS యూనిట్ $\longrightarrow gm/cm^3$

◆ ఎక్కువ సాంద్రత ఉండే పదార్థాలు బరువైనవని, తక్కువ సాంద్రత ఉండే పదార్థాలు తేలికైనవని చెప్పవచ్చు.

సాపేక్ష సాంద్రత/తారతమ్య సాంద్రత: ఒక వస్తువు సాంద్రతను నీటి సాంద్రతతో పోల్చడాన్ని సాపేక్ష సాంద్రత అంటారు.

◆ $\text{వస్తువు సాపేక్ష సాంద్రత} = \frac{\text{వస్తువు సాంద్రత}}{\text{నీటి సాంద్రత}}$

◆ $\text{ద్రవం సాపేక్ష సాంద్రత} = \frac{\text{ద్రవం ద్రవ్యరాశి}}{\text{అంతే ఘనపరిమాణం ఉండే నీటి ద్రవ్యరాశి}}$

◆ పాదరసం సాపేక్ష సాంద్రత = 13.6 (సాపేక్ష సాంద్రతకు ప్రమాణాలు లేవు)



బారోమీటర్

1) ఒకే ద్రవ్యరాశి ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత $= \frac{2P_1P_2}{P_1+P_2}$

2) ఒకే ఘనపరిమాణం ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత $= \frac{P_1+P_2}{2}$

వాతావరణ పీడనం(P_o) : భూమిపై ఉన్న అన్ని వస్తువులపై గాలి కలిగించే పీడనాన్ని వాతావరణ పీడనం అంటారు.

$\therefore P_o = pgh$

p = వాతావరణ సాంద్రత

g = గురుత్వ త్వరణం

h = వాతావరణం ఎత్తు

◆ వాతావరణ పీడనాన్ని కొలవడానికి బారోమీటర్ ఉపయోగిస్తారు.

భారమితి (బారోమీటర్): దీన్ని టారిసెల్లి అనే శాస్త్రవేత్త కనుక్కున్నాడు. ఇందులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

◆ సముద్ర మట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం P_o = 76 cm

◆ సముద్ర మట్టం వద్ద వాతావరణ పీడనం ఒక అట్మాస్ఫియర్ పీడనానికి సమానం.

$\therefore$ 1 Atma $= 1.01 \times 10^5$ పాస్కల్

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు హఠాత్తుగా తగ్గడం తుపాను రాకను సూచిస్తుంది.

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు నెమ్మదిగా తగ్గడం వర్షం రాకను సూచిస్తుంది.

◆ సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. లోతుకు వెళ్లేకొద్దీ పెరుగుతుంది.

నీరు - పీడనం: నీరు మూడు రకాల పీడనాలను కలిగిస్తుంది.

1) ఊర్ధ్వ పీడనం: నీరు వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలిగించే పీడనాన్ని ఊర్ధ్వ పీడనం అంటారు.

2) అధో పీడనం: నీరు పాత్ర అడుగు భాగంలో కలిగించే పీడనాన్ని అధోపీడనం అంటారు.

3) పార్శ్వ పీడనం: నీరు పాత్ర పక్కతలాలపై కలిగించే పీడనాన్ని పార్శ్వపీడనం అంటారు.

ఉత్ప్లవన బలం: ద్రవంలో ఉన్న వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలగజేసే బలాన్ని ఉత్ప్లవన బలం అంటారు.

◆ ద్రవాల సాంద్రతను కొలిచే పరికరం - హైడ్రోమీటర్

◆ పాల స్వచ్ఛతను కొలిచే పరికరం - లాక్టోమీటర్

ఆర్కిమెడిస్ సూత్రం: ద్రవంలో ఒక వస్తువును పూర్తిగా లేదా పాక్షికంగా ముంచినప్పుడు అది ఆ ద్రవంలో కోల్పోయినట్లు అనిపించే బరువు, ఆ వస్తువు తొలగించిన ప్రవాహి లేదా ద్రవం బరువుకు సమానం.

అనువర్తనాలు: 1) ఆభరణాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగపడుతుంది. 2) జలాంతర్గాములు ఈ సూత్రం మీదే పనిచేస్తాయి.

పాస్కల్ నియమం: ప్రత్యేకమైన ఆకారం ఉండే పాత్రలో ద్రవం నింపి ఒకవైపు తక్కువ పీడనాన్ని కలిగిస్తే అది ఆ ద్రవంలో అన్ని వైపుల్లో సమానంగా పీడనాన్ని కలిగించి రెండో వైపు అధిక పీడనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీన్నే పాస్కల్ నియమం అంటారు.

అనువర్తనాలు: 1) హైడ్రాలిక్ బ్రేకులు 2) హైడ్రాలిక్ జాకీలు 3) పత్తి నుంచి పత్తి బేళ్ల తయారీ 4) బ్రామాప్రెస్ పనిచేయడానికి ఈ నియమం ఉపయోగపడుతుంది.

బెర్నౌలీ సూత్రం: భూమికి క్షితిజ సమాంతరంగా, వేగంగా గాలి వీచినప్పుడు వస్తువు పైభాగంలో కంటే అడుగు భాగంలో అధిక పీడనం ఏర్పడి వస్తువులు పై దిశగా కదులుతాయి. దీన్నే బెర్నౌలీ సూత్రం అంటారు.


అనువర్తనాలు: ● విమానం గాల్లోకి ఎగరడం. ● ఫ్యాన్ గాలికి గోడకు తగిలించిన క్యాలెండర్ అడుగుభాగాన కాగితాలు పైకి కదలడం. ● తుపాను గాలికి తాటాకులు, గుడిసె పైకప్పులు ఎగిరిపోవడం. ● గాలిపటం భూమి నుంచి కొంత ఎత్తులో ఎగరడం.



రచయిత: చంటి రాజుపాలెం

SENIOR INTER Botany





Special proteins in cell membrane

Transport in plants (2 Marks)　Q&A

1) Define water potential? What is the value of water potential of pure water.

A: The relative difference between the chemical potential of pure water to that of solution. Water potential of the solution increases with increase of water molecules. Water potential of pure water is maximum i.e., zero (0).

2) What are Porins? What role do they play in diffusion?

A: Special proteins present in cell membrane are called porins. Present in the membranes of mitochondria, plastids and bacteria and allow the hydrophilic (water loving) molecules of their size.

Photosynthesis In Higher Plants (2 Marks)

1) Define the Law of Limiting factors proposed by Blackman.

A: When photosynthesis is influenced by several factors, the rate of the process is limited by slowest factor and this factor is called limited factor. CO_2 is limiting factor for photosynthesis.

2) Where does the photolysis of H_2O occur? What is its significance?

A: Thylakoid lumen of the chloroplast. The oxygen (O_2) evolved in photolysis is life gas for all organisms during respiration.

Some More Imp Questions 2 Marks　For Answers

Transport in plants

1) What are apoplast and symplast?

2) Differentiate Osmosis and Diffusion.

3) How does guttation differ from transpiration?

Photosynthesis In Higher Plants

1) What is the primary acceptor of CO_2 in C_3 plants? What is first stable compound formed in a Calvin cycle?

2) How many molecules of ATP and NADPH are needed to fix a molecule of CO_2 in C_3 plants? Where does this process occur?

-Dr. M. Chenna Kesavulu

నేత్రపర్వం.. ఆదిదంపతుల గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఆదిదంపతుల గిరిప్రదక్షిణను నేత్రపర్వంగా గురువారం నిర్వహించారు. దుర్గగుడి టోల్‌గేటు సమీపంలోని కామధేను అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలంకరించిన వాహనంపై గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజ చేసిన అనంతరం ఈవో రామారావు కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. భాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణల బృందాలతో కుమ్మరిపాలెం సెంటరు, నాలుగు స్తంభాల సెంటరు, సితార, కబేళా, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట మీదుగా మల్లికార్జున మహామండపం వరకు ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు ఆదిదంపతులకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. వైదిక కమిటీ సభ్యులు స్థానాచార్య శివప్రసాదశర్మ, శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.



ఆదిదంపతుల ఊరేగింపులో భక్తులు

ప్రాచీన కళలను భావితరాలకు అందజేయాలి

చిట్టూర్పు(ఘంటసాల), న్యూస్‌టుడే: ప్రాచీన సాంస్కృతిక వారసత్వ సంపదను భావితరాలకు అందజేయాని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో నిర్వహించిన తాళం భజన పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బుద్ధప్రసాద్‌తో పాటు అతిథులు విశాఖకు చెందిన అంతర్జాతీయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షురాలు ఏవీఎస్ జయశ్రీ, అంతర్జాతీయ ఇన్నర్‌వీల్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.అరుణశ్రీ, తిరుపతికి చెందిన ప్రొ. మస్తానమ్మ, హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొ. మునిరత్నంనాయుడు, పలువురు తెదేపా నాయకులు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. తాళం భజన పోటీల్లో 40 భక్త, 8 మురళీ కోలాట సమాజాలు పాల్గొన్నాయి. స్థానికులు ప్రసన్న, నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులచే నిర్వహించిన యోగా ప్రదర్శనలు, స్థానిక గాయకురాలు శివనాగలక్ష్మి ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి.



అమీనాపురం భక్త సమాజానికి నగదు, ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెదేపా నేతలు

విజేతలకు బహుమతుల ప్రదానం

తాళం భజన పోటీల్లో పమిడిముక్కల మండలం అమీనాపురానికి చెందిన శ్రీరాజా రామ భక్త సమాజానికి ప్రథమ బహుమతిగా రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందజేశారు. ☛ మురళీ కోలాటంలో ప్రథమ బహుమతి కింద పామర్రు మండలం కొండిపర్రుకు చెందిన ముద్దుల మురళీకృష్ణ కోలాటం భక్త సమాజానికి రూ.10వేల నగదు అందజేశారు.

సర్క్యూట్ బెంచ్ ఏర్పాటుకు విజ్ఞప్తి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ వినియోగదారుల ఫోరం నుంచి మచిలీపట్నం ఫోరానికి బదిలీ చేసిన 300 కేసులను.. నగరంలోనే విచారించాలని, దీనికోసం ఇక్కడ ఒక సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయాలని బెజవాడ బార్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్ తదితరులు గురువారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. విజయవాడ ఫోరం కేసులు బదిలీ కావడంతో.. విచారణకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీరి సమస్యను పరిశీలించి విజయవాడలో ఒక సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రి మనోహర్‌ను సన్మానించారు. అనంతరం రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఛైర్మన్ డి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం ఇచ్చామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో చలసాని అజయ్‌కుమార్, సోము కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం 35 సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలను ఎంపీ కేశినేని, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎలాంటి క్రీడా సౌకర్యాలు లేవన్నారు. 2027లో జాతీయ క్రీడల నిర్వహించేందుకు అమరావతిలో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలని కోరారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గాల్లో అసంపూర్తిగా ఉన్న క్రీడా మైదానాలను వెంటనే పూర్తిచేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్ని పాఠశాలలో క్రీడా మైదానాలు ఏర్పాటుచేయాలని జీవో విడుదల చేయడం శుభసూచకమన్నారు. ఇన్‌ఛార్జి వీసీగంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఏపీ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గౌతమ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



హర్డిల్స్‌లో యువతులు

తొలిరోజు విజేతలు వీరే.. అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలోం తొలిరోజు ఆంధ్ర క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-20 పురుషుల విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ బంగారు పతకాన్ని సాధించారు. ఇదే విభాగంలో 1,500 మీటర్ల పరుగుపందెంలో తెలంగాణ క్రీడాకారుడు కట్రావత్ శ్రీను ప్రథమ, ఏపీ క్రీడాకారుడు కురుబ మహేంద్ర ద్వితీయ, 5వేల మీటర్ల పరుగుపందెంలో హరీష్ మల్లు తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్- 16 బాలుర విభాగంలో నిర్వహించిన 4 కిలోల షాట్‌పుట్ పోటీలలో ప్రణీత్‌కుమార్ మొదటి, ఇదే విభాగంలో నిర్వహించిన లాంగ్‌జంప్‌లో యశ్వంత్‌రాజ్ మూడో, అండర్-16 బాలికల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో డింపుల్ మహా శ్రీ మొదటి స్థానాలను సాధించారు.

నెమలి ఆదాయం రూ.22.59 లక్షలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ ఏడాది జూన్ 13 నుంచి గురువారం వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఆలయానికి రూ. 22,59,090 ఆదాయం లభించినట్లు సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. లెక్కింపును దేవాదాయ శాఖ గన్నవరం తనిఖీ అధికారిణి కె.అనురాధ పర్యవేక్షించారు.

క్రీడావికాస కేంద్రాల అభివృద్ధికి కృషి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గురువారం భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాప్ అమలు చేస్తున్న విధి విధానాలను ఆమెకు వివరించారు. రాష్ట్రంలో ఖేలో ఇండియా-శాప్ ద్వారా నిర్వహిస్తున్న క్రీడా వికాస కేంద్రాలకు నిధుల లభ్యత పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ శాప్ ద్వారా పూర్తి స్థాయి నివేదిక తయారు చేసి ఇస్తే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన క్రీడారంగాన్ని తిరిగి పునరుద్ధరిస్తామని రవినాయుడు వివరించారు. విశాఖలో క్రికెట్ హబ్, తిరుపతిలో కబడ్డీ, కాకినాడ, రాజమహేంద్రవరం వంటి నగరాల్లో అనుకూలమైన క్రీడలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడలపై టూరిజం హబ్ ఏర్పాటు చేస్తే..కనుమరుగవుతున్న ఆటలు నేటి తరం యువతకు తెలుస్తాయని పురందేశ్వరి సూచించారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెడతామని రవినాయుడు వివరించారు.



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

'రిజర్వేషన్లతోనే అట్టడుగు వర్గాలకు ప్రయోజనం'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలైతేనే అట్టడుగు వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని, దీనికోసం ప్రత్యేక చట్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగం 90 శాతం మేర ప్రైవేటుపరమైందని పేర్కొన్నారు. రిజర్వేషన్లు లేకపోవడంతో పేద వర్గాలు ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ రంగంలో చొరబాటు వల్ల ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో సరిపెడుతున్నారని.. వీరందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. 1981 జనాబా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగాల్లో పెట్టుబడులను కేంద్రం వెనక్కి తీసుకోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉద్యోగాలు కోల్పోయారని వివరించారు. సోషలిస్టు కూటమి జాతీయ నాయకుడు ఎల్.జైబాబు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పరిశ్రమల్లో రిజర్వేషన్లు కల్పించబోమని చెప్పడం అన్యాయమన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో అన్ని రకాల సౌకర్యాలు పొందుతున్నందున.. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై త్వరలోనే అన్ని జిల్లాల్లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సదస్సులు, సభలు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ మేయర్ తాడి శకుంతల మాట్లాడుతూ.. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.అప్పలరాజు, వీరభాస్కర్, కె.ఎం.ఎ.సుభాన్, ఫణిరాజ్, గిద్దా శ్రీనివాస్ నాయుడు, అంగడాల పూర్ణ, అడపా మోహన్, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ. హాజరైన జైబాబు, శకుంతల, అప్పలరాజు, వీరభాస్కర్, వివిధ సంఘాల నాయకులు

15 రోజుల్లో పచ్చదనం పనులు పూర్తి

రామవరప్పాడు, న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు నుంచి గన్నవరం ఎయిర్ పోర్టు వరకు గ్రీనరీ, వెటర్నరీ కళాశాల వద్ద చేయాల్సిన బ్యూటిఫికేషన్ పనులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జీఎం దయాకర్ బాబు, ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ సత్యనారాయణలు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వివరించారు. పచ్చదనం, సుందరీకరణ పనులపై ఎమ్మెల్యే సమావేశం నిర్వహించిన రెండు రోజుల్లోనే సంబంధిత అధికారులు గురువారం విజయవాడ పటమటలోని కార్యాలయంలో యార్లగడ్డ వెంకట్రావును కలిసి వారు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జాతీయ రహదారిపై రామవరప్పాడు నుంచి విమానాశ్రయ ప్రవేశ ద్వారం వరకు పచ్చదనం అభివృద్ధి పనులను ఏపీజీ అండ్ బీసీ ద్వారా చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. గన్నవరం నుంచి చిన్నఅవుటుపల్లి వరకు చేపట్టే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ కారిడార్ డెవలప్‌మెంట్, నిర్వహణ కోసం సమన్వయక కమిటీ వేసి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఎన్నుకున్నారు. అధికారులు స్పందించి తీసుకున్న చర్యలను ఎమ్మెల్యే యార్లగడ్డ అభినందించారు.



ఎమ్మెల్యే వెంకట్రావుతో మాట్లాడుతున్న అధికారులు

గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

145 కిలోల సరకు, నాటు తుపాకీ స్వాధీనం

పటమట, విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా నుంచి తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు సభ్యుల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముఠా వాహనంలో 145 కిలోల గంజాయితోపాటు ఆరు బుల్లెట్లతో ఓ దేశవాళీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన రమేష్ వినేష్‌కుమార్, కుమారన్ మారి మూర్తిలు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి గురువారం కారులో గంజాయి తరలిస్తున్నారు. స్పష్టమైన సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు రామవరప్పాడు రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. గంజాయి తరలిస్తున్న కారు రాగానే పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. కారులో గంజాయితోపాటు దేశవాళీ తుపాకీ ఉండడంతో పోలీసులు అవాక్కయ్యారు. నిందితులతోపాటు గంజాయి, తుపాకీని స్వాధీనం చేసుకుని పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. మరింత లోతుగా విచారించగా వీరిపై విశాఖపట్నం, తమిళనాడుల్లో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు